హైదరాబాద్ వార్త

భూమే బంగారమాయెనే..

➡ కోకాపేట్‌లో కోట్లు కరిపిస్తున్న భూముల ధరలు

➡ ఒక్క ఎకరం వందకోట్లు

కోకాపేట కేక!

హైదరాబాద్, ఆగస్టు 3 ప్రభాతవార్త : ఎన్ని కోట్లయినా సరే భూములను సొంతం చేసుకునేందుకు పోటీ పడ్డారు. హెచ్‌ఎండిఎ నిర్వహించిన భూముల అమ్మకాల్లో సరికొత్త చరిత్ర సృష్టించింది. నిధుల సమీకరణ కోసం హెచ్‌ఎండిఎ గురువారం భూముల అమ్మక ప్రక్రియను చేపట్టిన విషయం తెలిసిందే. కోకాపేట్‌లో నియో పోలీస్‌లే అవుట్‌లో మొత్తం 45.33 ఎకరాలను అమ్మకానికి పెట్టింది. ఇందులో భాగంగా గురువారం ఉదయం సెషన్‌లో భాగంగా మొత్తం నాలుగు ప్లాట్లకు హెచ్‌ఎండిఎ వేలం నిర్వహించింది. ఇందులో ఒక ప్లాట్ అత్యధికంగా ఎకరం ఏకంగా రూ.100.25 కోట్లకు అమ్ముడైపోయింది. ఈ వేలంలో ప్లాట్ల కోసం రియల్టర్లు ఎగ బడ్డారు. ఎన్ని కోట్లయినా సరే భూములను సొంతం చేసుకునేందుకు పోటీ పడ్డారు. ఒక ఎకరానికి గరిష్టంగా రూ.100.25కోట్లు పలికిందంటే నియో పోలీస్ భూములకు ఉన్న క్రేజ్ అర్థం చేసుకోవచ్చు. మొదటి విడతలో భాగంగా 26.86ఎకరాలకు వేలం పాట నిర్వహిస్తున్నారు. ఉదయం జరిగిన మొదటి విడత వేలం ద్వారా రూ.1532.50 కోట్ల ఆదాయం వచ్చింది. అత్యల్పంగా ఎకరం భూమి 51.75కోట్లు పలికింది. ఇదిలా ఉంటే ఈ భూములకు ప్రభుత్వం నిర్ణయించిన కనీస ధర రూ.35 కోట్లు మాత్రమే వేలంలో భూములకు అంచనాలకు మించిన ఆదాయం వచ్చింది.గతంలో కోకాపేటలో 49 ఎకరాల విస్తీర్ణంలోని ప్లాట్స్‌ను విక్రయించడం ద్వారా ప్రభుత్వానికి రెండువేల కోట్ల ఆదాయం వచ్చిన విషయం తెలిసిందే. అప్పుడు కనిష్టంగా ఎకరా రూ.31 కోట్ల నుంచి అత్యధికంగా 60 కోట్ల రూపాయల ధర పలికింది. ఇప్పుడు కూడా ఆదే స్థాయిలో ధర వస్తుందని అధికారులు భావిస్తున్నారు. రూ.2000 కోట్ల నుండి రూ.2500 కోట్ల వరకు ప్రభుత్వం ఖజానాకు సమకూరుతుందని హెచ్‌ఎండిఎ ఆశిస్తోంది. కోకాపేట నియో పోలీస్ భూముల్లో మల్టీపర్పస్ నిర్మాణాలు చేసుకోవడానికి అవకాశం ఉండడంతో భారీగా డిమాండ్ పెరిగింది. ఆఫీస్, రెసిడెన్షియల్ స్పేస్‌కు ఉపయోగించుకునే అవకాశం ఉంది. భారీ నిర్మాణాలకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వనుంది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఎయిర్పోర్ట్‌కు, సిటీకి అత్యంత దగ్గరలో ఉన్న భారీ లేఅవుట్ కోకాపేట నియో పోలీస్‌లేఅవుట్..దీంతో డిమాండ్ భారీగా పెరిగింది. దీన్నిబట్టి ఇక్కడి భూములకు ఉన్న క్రేజ్ అర్థం చేసుకోవచ్చు.

వైద్యవృత్తినే దైవారాధనగా భావించిన వ్యక్తి ఎల్లాప్రగడ

ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

చిక్కడపల్లి, ఆగస్టు 3 ప్రభాతవార్త: వైద్య వృత్తినే దైవారాధనగా భావించిన ఎల్లాప్రగడ సుబ్బారావు దేశంలోనే శస్త్రచికిత్సల నిపుణుడుగా ఖ్యాతి పొందారని తెలంగాణ శాసనసభ తొలి మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. శతాబ్దిపూర్వ మహనీయుల యాదిలో కార్యక్రమంలో భాగంగా త్యాగరాయ గానసభలో అధ్యక్షుడు కళావిఎస్.జనార్దనమూర్తి అధ్యక్షతన ప్రఖ్యాత శాస్త్రవేత్త ఎల్లాప్రగడ సుబ్బారావు జయంతి సభ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మధుసూదనాచారి మాట్లాడుతూ గోదావరి జిల్లాలో పేదల వైద్యుడిగా సుబ్బారావు పేరును సంపాదించారన్నారు. ఇట్టి మహనీయుల జీవితాలు నేటివారికి తెలపాలని, అందువల్ల వారి నుంచి స్ఫూర్తిని పొంది సమాజంలో సేనచేయడానికి మరింత ముందుకు వస్తారన్నారు.తెలంగాణ బెవరేజెస్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ దేవీప్రసాద్ మాట్లాడుతూ సుబ్బారావు అజ్ఞాత మహనీయుడు అని కీర్తించారు.

మాయమైన నీడ..!

నగరంలో ఖగోళ అద్భుతం.. కొన్ని నిమిషాల పాటు నీడ మాయం

హైదరాబాద్, ఆగస్టు 3 ప్రభాతవార్త : నగరంలో గురువారం అరుదైన ఖగోళ అద్భుతం ఆవిష్కృతమైంది. మధ్యాహ్నం 12.33 గంటలకు జీరో షాడో డే సందర్భంగా హైదరాబాద్‌లో సూర్యకిరణాలు నిట్టనిలువుగా పడి నిటారుగా ఉన్న వస్తువుల నీడ కొన్ని నిమిషాల పాటు కనిపించకుండా పోయింది. ఇదే అద్భుతం మే 9న కూడా ఆవిష్కృతమైంది. ఈ ఏడాది ఏప్రిల్ 25న బెంగుళూరులో కూడా మధ్యాహ్నం 12.17 నిమిషాలకు ఎండలో ఉన్న వస్తువులు, మనుషుల నీడ మాయమైంది.

డెంగీ క్యూ!

ఆస్పత్రులు హౌస్‌ఫుల్

నగరాన్ని వణికిస్తున్న విష జ్వరాలు

ఒకరు చేరాలంటే మరొకరిని డిశ్చార్జ్ చేయాల్సిందే

బాధితుల్లో 50 శాతం మంది 14 ఏళ్లలోపు పిల్లలే

డెంగీ ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. నగరంలో కొంత కాలంగా డెంగీ పాజిటివ్ కేసుల సంఖ్య అధికమవుతోంది. దోమల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం.ప్రతి ఆదివారం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నామని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరస్థితులు ఆందోళన కరంగా మారుతున్నాయి. అడుగడుగునా చెత్తకుప్పలు, డ్రైనేజీ మురుగుతో రోడ్లు కంపు కొట్టడానికి తోడు ఎడతెరిపిలేని వర్షాలతో దోమలు, ఈగలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో జనానికి కంటిమీద కునుకు కరువవుతోంది. జ్వరం రాగానే డెంగీ, మలేరియా, టైఫాయిడ్ పరీక్షలన్నీ చేయించుకుంటున్నారు. అయితే మూడేళ్ళ తర్వాత ఈసారి డెంగీ కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయని వైద్య వర్గాలు వెల్లడించాయి.

హైదరాబాద్, ఆగస్టు 3 ప్రభాతవార్త : డెంగీ దోమలు పసిపిల్లలపై పంజా విసురుతున్నాయి. తీవ్రమైన జ్వరం, జలుబుతో బాధపడుతూ ఆస్పత్రులకు చేరుతున్న చిన్నారుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. నిలోఫర్ ప్రభుత్వ నవజాత శిశువుల ఆరోగ్య కేంద్రం సహా నగరంలోని పలు ప్రైవేటు చిన్నపిల్లల ఆస్పత్రులు సైతం జ్వర బాధితులతో కిక్కిరిసిపోతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లోని పీడియాట్రిక్ విభాగాలన్నీ హౌస్‌ఫుల్ కావడంతో పడకల కోసం పడిగాపులు కాయాల్సి వస్తోంది. వైద్యం అటుంచి.. కనీసం పడుకునేందుకు బెడ్ దొరికితే చాలు అన్నట్లుగా ఉంది. గ్రేటర్‌లో బాధితుల్లో 50 శాతం మంది 14 ఏళ్లలోపు పిల్లలే కావడం గమనార్హం. జ్వరపీడితుల్లో నిలోఫర్, గాంధీ పీడియాట్రిక్ వార్డులు పూర్తిగా నిండిపోయాయి. ఇక నిలోఫర్ ఆస్పత్రిలో ఒకే బెడ్‌పై ఇద్దరు పిల్లలను ఉంచి చికిత్స అందిస్తున్నారు. దీంతో చిన్నారుల తల్లిదండ్రులు విధిలేని పరస్థితుల్లో ప్రైవేటు ఆస్పత్రులు, క్లీనిక్స్‌లను ఆశ్రయిస్తున్నారు. తీరా అక్కడ కూడా చేదు అనుభవమే ఎదురవుతోంది. రోజురోజుకు పెరుగుతున్న రోగుల రద్దీ దృష్ట్యా జ్వరం పూర్తిగా తగ్గకుండానే బాధితులను ఆస్పత్రి నుంచి డిశ్చార్జీ చేసి కొత్తవారిని అడ్మిట్ చేసుకోవాల్సి వస్తుందని ప్రైవేటు వైద్యులు పేర్కొంటున్నారు. ఇక ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో నమోదవుతున్న డెంగీ కేసులు వివరాలు గోప్యంగా ఉంచుతుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

బాధితుల్లో చిన్నపిల్లలే ఎక్కువ.. పెద్దలతో పోలిస్తే చిన్నపిల్లల్లో రోగ నిరోధకశక్తి తక్కువగా ఉంటుంది. సీజన్ మారినప్పుడు పలువురు చిన్నారులు జ్వరం, దగ్గు, జలుబు, నిమోనియాతో బాధపడుతుంటారు. డెంగీ దోమలు ఎక్కువగా పగటిపూట కుడుతుంటాయి. మూడేళ్లలోపు చిన్న పిల్లలు ఎక్కువగా పగటిపూట నిద్రపోతుంటారు. కాళ్లు, చేతులు పూర్తిగా కవర్‌చేసే దుస్తులకు బదులు ఆఫ్‌షర్ట్స్, షార్ట్స్ ధరిస్తుంటారు. వీరిని దోమలు కుట్టడంతో త్వరగా డెంగీ బారిన పడుతుంటారు. ఇక స్కూలు పరిసరాల్లో పారిశుధ్య లోపంతో విద్యార్థులకు జ్వరాలు వస్తున్నాయి. డెంగ్యూ జ్వరం 'ఏడిస్ ఈజిప్ట్' అనే ఆడ దోమ పగటి పూట నొప్పిరాకుండా కుట్టడం వల్ల వస్తుందని, నియో బిబిసి చిల్డ్రన్ ఆస్పత్రి ఎండి, ప్రముఖ పిల్లల వైద్యనిపుణులు డాక్టర్ మంజుకొండ రంగయ్య పేర్కొన్నారు. డెంగ్యూ బారిన పడకుండా పిల్లలకు పూర్తి రక్షణ కల్పించాలని ప్రతి ఇంటిలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. డెంగ్యూ వ్యాధికి కారణం, వ్యాధి రాకుండా తీసుకునే జాగ్రత్తలను ఆయన వివరించారు. డెంగ్యూ జ్వరం రావడానికి దోమ కాటు నుంచి ఐదు నుంచి ఎనిమిది రోజుల సమయం పట్టవచ్చని తెలిపారు.

టెస్టుల పేరుతో ఫీజుల దోపిడి.. జనాల్లో డెంగీ భయం పెరగడంతో ఇదే అదనుగా ప్రైవేటు ఆస్పత్రుల్లో దోపిడికి తెగబడ్డాయి.మూడు రోజులకు మించి ఫీవర్ తగ్గకపోతే వెంటనే ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు.దీంతో ఇదే అదునుగా ప్రైవేటు హాస్పిటల్స్ దోపిడీకి తెరలేపుతున్నాయి. నార్మల్ ఫీవర్‌తో వెళ్లినా లేనిపోని టెస్టులు చేసి ప్లేట్‌లెట్స్ తగ్గాయని, ఆలస్యం చేస్తే పరిస్థితి సీరియస్ అవుతుందని భయపెడుతున్నారు. కొన్ని ఆస్పత్రుల్లో ప్లేట్‌లెట్స్ కౌంట్ లక్ష కంటే ఏమాత్రం తగ్గినా ప్లేట్‌లెట్ రెడీ చేసుకోవాలని సూచిస్తుండడంతో రోగుల బంధువుల్లో టెన్షన్ మొదలవుతోంది. ఈ వ్యాధులకు ప్రమాదన కారణం దోమలు అని తెలిసి వాటిని పూర్తిగా నివారించి ప్రజలకు రక్షణ కల్పించాల్సిన అధికారులు నామమాత్రపు చర్యలు చేపడుతూ చేతులు దులుపుకుంటున్నారు. విషజ్వరాలు డెంగ్యూ బారినపడుతున్నది ఎక్కువగా మురికివాడలకు చెందిన పిల్లలే కావడంతో వారిలో పేద వారు ప్రభుత్వ ఆసుపత్రులకు ఆశ్రయిస్తుండగా, కొద్దిగా స్తోమత ఉన్నవారు ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. విష జ్వరాలో అంత పెద్ద ప్రమాదం లేప్పటికీ డెంగ్యూతో పెద్ద ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఎక్కువ మంది డెంగీ షాక్ సిండ్రోమ్‌తో చేరుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. శరీరంలో ప్లేట్‌లెట్లు తగ్గిపోయి.. రక్తస్రావం అవుతున్న క్రమంలో ఆసుపత్రికి వస్తున్నారు. కొందరిలో పరిస్థితి విషమంగా మారుతోందని అంటున్నారు. ముందే మేలుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

రోగులకు అవసరం లేకున్న ప్లేట్‌లెట్లు ఎక్కిస్తున్న వైనం.. గతంలో కరోనా బాధితులను పీల్చి పిప్పి చేసిన అనేక ప్రైవేటు ఆసుపత్రులు...ఇప్పుడు డెంగీ రోగుల జేబులు గుల్ల చేస్తున్నాయి. తప్పుడు రిపోర్టుల్లో ప్లేట్‌లెట్ల సంఖ్యను తక్కువగా చూపిస్తున్నాయి. ప్లేట్‌లెట్లు అవసరం లేకపోయినా ఎక్కిస్తూ డబ్బులు గుంజుతున్నాయి. ప్రైవేటు ఆసుపత్రుల్లో అనవసరంగా ఫీజులు వసూలు చేయొద్దని వైద్య ఆరోగ్యశాఖ పదేపదే చెబుతున్నా కొన్ని ఆసుపత్రులు ఏమాత్రం పట్టించుకోవడంలేదు. రూ.50 వేల నుంచి రూ.2లక్షల వరకు వసూలు చేస్తూ రోగుల్ని ఇబ్బందుల పాలు చేస్తున్నాయి.రోగికి 50 వేలకు పైగా ప్లేట్‌లెట్లు ఉన్నా ఐసీయూలో ఉంచి అదనంగా ప్లేట్‌లెట్లు ఎక్కిస్తున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి.

అడ్డగుట్టలో వంద పడకల ఆసుపత్రి కోసం ఆందోళన చేస్తున్న సిపిఎం నేతలు

వంద పడకల ఆసుపత్రిని నిర్మించాలి : సిపిఎం

అడ్డగుట్ట, ఆగస్టు 3 ప్రభాతవార్త: సికింద్రాబాద్, అడ్డగుట్టలో వంద పడకల ఆసుపత్రిని వెంటనే నిర్మించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో గురువారం అడ్డగుట్ట చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జోన్ కార్యదర్శి అజయ్ బాబు మాట్లాడుతూ మహేంద్రహిల్స్‌లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలను కాపాడాలని, జిఎం అంజయ్య విగ్రహం సమీపంలో ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలంలో వంద పడకల ప్రభుత్వ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఏ.బాలయ్య, ఆర్. మల్లేశ్, మహేందర్, ఆర్.వీరలక్ష్మి, ఎం.గోపాల్, అంజమ్మ, కిరణ్, బీమయ్య తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక సంగీత విద్వాంసులు డీవీ.మోహనకృష్ణ పద్మశ్రీ అవార్డుకు అర్హులు

జాతీయ కళాకారుల సంఘం అధ్యక్షుడు ఎల్‌వి.చెన్నారావు

డీవీ.మోహనకృష్ణను సత్కరించిన దృశ్యం

చిక్కడపల్లి, ఆగస్టు 3 ప్రభాతవార్త: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కర్ణాటక శాస్త్రీయ సంగీతంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించిన వ్యక్తి సంగీత విద్వాంసులు డీవీ.మోహనకృష్ణ అని జాతీయ కళాకారుల సంఘం అధ్యక్షుడు ఎల్‌వి.చెన్నారావు అన్నారు. గురువారం కర్ణాటక సంగీత విద్వాంసులు డీవీ.మోహనకృష్ణను అభినందించే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎల్‌వి.చెన్నారావు మాట్లాడుతూ డీవీ.మోహనకృష్ణ వంటి కర్ణాటక సంగీత విద్వాంసులు తెలుగు రాష్ట్రాలలో ఉండడం గర్వకారణమని అన్నారు. ముఖ్యంగా సుప్రసిద్ధ సంగీత విద్వాంసులు మంగళంపల్లి బాలమురళీకృష్ణకు ప్రియ శిష్యుడిలో ఒకరని కీర్తించారు. ఇటువంటి కళాకారులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరైన గుర్తింపునిచ్చి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, కేంద్ర సంగీత నాటక అకాడమి అవార్డు, పద్మశ్రీ లాంటి అవార్డులకు డీవీ.మోహనకృష్ణ అర్హులని, డీవీ.మోహనకృష్ణ లాంటి కళాకారులను ప్రభుత్వాలు గుర్తిస్తే ఆ కీర్తి ప్రభుత్వాలకు కూడా వస్తుందన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలు, కర్ణాటక సంగీతాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బిఎల్‌వి.రమణ, నగర అధ్యక్షుడు హనుమంతు, కార్యదర్శి నగేశ్ పాల్గొన్నారు.

యజమానికే టోకరా

ఆభరణాలు చోరీ చేసిన నిందితుడి అరెస్టు

38 తులాల ఆభరణాలతో పాటు డమ్మీ తుపాకి స్వాధీనం

విలేకర్ల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడిస్తున్న చార్మినార్ ఏసిపి రుద్ర భాస్కర్

చార్మినార్, ఆగష్టు 3 ప్రభాతవార్త : యజమానిని మోసం చేసి 52 తులాల బంగారం ఆభరణాలను దొంగతనం చేసిన కార్మికుడిని హుస్సేనీఆలం పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి 38 తులాల బంగారంతో పాటు సెల్ ఫోన్, నకిలీ తుపాకీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను చార్మినార్ ఏసిపి రుద్ర భాస్కర్ గురువారం చార్మినార్ ఏసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు.మహారాష్ట్రకు చెందిన తారక్ నాథ్ బేరా ఘాన్సీ బజార్ డివిజన్ పరిధిలోని చేలాపురలో నివాసం ఉంటున్నాడు. కాగా తారాకాంత్ బేరా ఘాన్సీ బజార్‌లో మూడు సంవత్సరాలు నుంచి బంగారం ఆభరణాలు తయారు చేసి నగరంలోని బంగారం షాపులకు సరఫరా చేస్తుంటాడు. బేరా వద్ద మూడు నెలలు నుంచి పశ్చిమ బెంగాల్ ప్రాంతానికి చెందిన ఖిఖాన్ మజీహా అలియాస్ సిరాజ్ (35) బంగారం ఆభరణాలు తయారు చేసే కార్మికుడిగా పని చేస్తున్నాడు.గత నెల 27 వతేదీ బేరా సిరాజ్‌కు 11 బంగారం నక్లెసులు, 4 గాజులు ఒక చెవి రింగు తయారు చేయాటానికి 520 తులాల బంగారం ఇచ్చాడు.కాగా సిరాజ్ అప్పుల పాలైయ్యాడు.అప్పులు తీర్చటంతో పాటు విలాసవంతమైన జీవితం గడపాలని సిరాజ్ యజమాని ఇచ్చిన 52 తులాల బంగారాన్ని తీసుకుని పారిపోయాడు. మోస పోయానని భావించి దుకాణం యజమాని ఈ విషయమై హుస్సేనీఆలం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దొంగతనం చేసిన బంగారాన్ని సిరాజ్ విశాఖపట్నంలో విక్రయించటానికి ప్రయత్నిస్తున్న సమయంలో పోలీసులకు పట్టుబడ్డాడు. విశాఖపట్నం నుంచి తీసుకు వచ్చిన సిరాజ్‌ను పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద నుంచి 380 గ్రాముల బంగారం, నకిలీ తుపాకీ, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పట్టుకున్నందుకు చార్మినార్ ఏసిపి రుద్రభాస్కర్ కానిస్టేబుళ్లకు రివార్డులను అందజేశారు. ఈ విలేకర్ల సమావేశంలో హుస్సేనీఆలం ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరెడ్డి, అడిషనల్ ఇన్‌స్పెక్టర్ కె.వీరభద్ర కుమార్,ఎస్ఐ నవీన్ పాల్గొన్నారు.

ఈనెల 6నుంచి గో మహా పాదయాత్ర : అఖిలభారత గోసేవా ఫౌండేషన్

హైదరాబాద్, ఆగస్టు 3,ప్రభాతవార్త: సేవ్‌కౌ, సేవ్ ఎర్త్‌నినాదంతో ఈనెల 6నుంచి హైదరాబాద్ నుంచి తిరుమల- అరుణాచలంకు గోమహాపాదయాత్ర నిర్వహించనున్నట్లు అఖిలభారత గోసేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు బాలకృష్ణ గురుస్వామి తెలిపారు. ఈమేరకు గురువారం సోమజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాదయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు6న ఉదయం 8గంటలకు సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళీ దేవాలయం నుంచి 100మంది స్వాములతో ఈపాదయాత్రను ప్రారంభించనునట్లు తెలిపారు. గోవిందమాల, శివమాల ధరించి గోవులను కాపాడాలని, గోవిందుని నందులను కాపాడాలని నందీశ్వరుని వేడుకుంటూ గోమహత్యాన్ని ఊరూరా చాటి చెబుతూపాదయాత్ర చేస్తామన్నారు. 6న జరిగే పాద యాత్ర ప్రారంభోత్సవానికి దత్త విజయానందస్వామి, మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎంపి. ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్యే రాజాసింగ్, సినీనటుడు సుమన్, కాంగ్రెస్‌నేత ఫిరోజ్‌ఖాన్ హాజరవుతారన్నారు.

నేటినుంచి గచ్చిబౌలి స్టేడియంలో సౌత్ ఆసియన్ తైక్వాండో ఛాంపియన్

బ్రోచర్ ఆవిష్కరిస్తున్న రాజేంద్రబాలన్, తైక్వాండో మాస్టర్లు

హైదరాబాద్, ఆగస్టు 3,ప్రభాతవార్త: తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ ఇండియా, యజు సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న 7వ సౌత్ ఏషియన్, 18వ సౌత్ వెస్ట్ ఇండియా తైక్వాండో ఛాంపియన్ పోటీలు గచ్చిబౌలి స్టేడియంలో నేటి నుంచి మూడురోజులపాటు నిర్వహించనున్నట్లు తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు డాక్టర్ రాజేంద్ర బాలన్ తెలిపారు. ఈమేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యజుసంస్థ నిర్వాహకులు డాక్టర్ ఉజ్వల్, తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ కర్ణాటక అధ్యక్షులు ప్రదీప్ జనార్థన్‌తో కలిసి ఛాంపియన్‌షిప్ బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈపోటీలల్లో ఎనిమందిదేశాల నుంచి అలాగే మనదేశంలో పన్నెండు రాష్ట్రాల నుంచి వెయ్యిమందికి పైగా క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. పద్నాలుగు సంవత్సరాల కంటే చిన్నావారి నుంచి వెటరన్స్ వరకు అందరికీ ఏడువిభాగాల్లో ఈపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈపోటీల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర క్రీడలమంత్రి శ్రీనివాస్‌గౌడ్, అతిథులుగా వికారాబాద్ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, శాట్స్‌చైర్మన్ ఆంజనేయగౌడ్, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జయేష్‌రంజన్ తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో తైక్వాండో మాస్టర్లు రచన, అబ్దుల్ రెహమాన్, నరేంద్రసింగ్ రావత్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సెల్ఫ్ డిఫెన్స్ ప్రొటెక్షన్‌పై అవగాహన

రాజేంద్రనగర్ జోన్ అడిషనల్ డిసిపి సాధన రష్మీ పెరుమాళ్,రాజేంద్రనగర్ సిఐ నాగేంద్ర బాబు

మైలార్‌దేవ్‌పల్లి,ఆగష్టు 3 ప్రభాతవార్త : నేటి బాలలు రేపటి భావి భారత పౌరులని రాజేంద్రనగర్ జోన్ అడిషనల్ డిసిపి సాధన రష్మీ పెరుమాళ్ అన్నారు. సైబర్ నేరాలపై గురువారం హైదర్‌గూడ జికె కాలనీలో టైనీ స్కాలర్స్ హైస్కూల్, సైబరాబాద్ పోలీసుల సహకారంతో నిర్వహించిన చిల్డ్రన్స్ సేఫ్టీ క్లబ్.సెల్ఫ్ డిఫెన్స్ ప్రొటెక్షన్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచే ్చారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా విద్యార్థులు సైబర్ నేరగాళ్ల చేతుల్లో బలైపోతున్నారని తెలిపారు. పిల్లలు తమఆశయాలను సాధించటంతో పాటు రక్షణ కోసం తప్పకుండ సెల్ఫ్ డిఫెన్స్ ప్రొటెక్షన్‌ను నేర్చుకోవాలని రాజేంద్రనగర్ జోన్ అడిషనల్ డిసిపి సాధన రష్మీ పెరుమాళ్ కోరారు.ఈ కార్యక్రమంలో రాజే ంద్రనగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్రబాబు,పోలీస్ అధికారులు,టైనీ స్కాలర్స్ హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతుడే కోటీశ్వరుడు: నగర కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

చిన్నారులకు మాత్రలు వేస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్, ఆగస్టు 3,ప్రభాతవార్త: ఆరోగ్యమే మహాభాగ్యమని ఆరోగ్యవంతుడైడే కోటీశ్వరుడని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. గురువారం జాతీయ నూలిపురుగు దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్ రోడ్డులోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ మనం ఆహార పదార్థాలను తినేటపుప్పుడు చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. చేతులకు శుభ్రం చేసుకుని తినకపోతే మనకడుపులోకి కీటకాలు వెళ్ళి అక్కడే ఉండి మనం తినే బలవర్ధకమైన ఆహారాన్ని మన శరీరానికి చేరకుండా చేస్తాయని అలాగే పిల్లల ఎత్తు, మొదడు ఎదగకుండా చేస్తాయని అన్నారు. ఒకప్పుడు నూలిపురుగు బాధితులు 65శాతం ఉంటే నేడు 1శాతానికి రావడం శుభపరిణామమన్నారు. ఈఒక్కశాతం కూడా లేకుండా చేయడానికి కృషి చేయాలన్నారు. ఒకటవ తరగతి నుంచి కాలేజీచదివే విద్యార్థుల వరకు అంటే 3నుంచి 19 సంవత్సరాల వయస్సు ఉన్నవారు ఈఆల్బెన్డ జోలే మాత్రలు వేసుకోవాలని అన్నారు. ఈమాత్రలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చూడాలన్నారు. ఈసందర్భంగా పాఠశాలలోని విద్యార్థులకు అలెక్టర్ అల్బెన్డజోల్ మాత్రలు వేశారు. ఈకార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ విజయారెడ్డి, జిల్లా విద్యాధికారి రోహిణి, సంయుక్త సంచాలకులు సుధీర, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శ్రీకళ, ప్రధానోపాధ్యాయురాలు కరుణ తదితరులు పాల్గొన్నారు.

హాస్పిటలకు వచ్చేరోగులకు పరీక్షించి మందులు ఇవ్వాలి.. హాస్పిటల్‌కు వచ్చిన రోగులకు శ్రద్ధగా పరీక్షించి వారికి కావాల్సిన మందులు ఇవ్వాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. గురువారం ఖైరతాబాద్ చింతల్‌బస్తీలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించి అక్కడ పనిచేస్తున్న సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్స్, పేషెంట్స్ ఛార్ట్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డా.సంధ్య, ఎస్‌పిహెచ్ఓ నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

కొత్త తహసీల్దార్లకు పోస్టింగ్‌లు కేటాయింపు

హైదరాబాద్, ఆగస్టు 3,ప్రభాతవార్త: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ జిల్లాకు బదిలీపై వచ్చిన కొత్త తహసీల్దార్లకు పోస్టింగ్‌లు కేటాయిస్తూ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి గురువారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. హైదారబాద్ రెవెన్యూ డివిజన్ ఆఫీస్ పరిపాలన అధికారి (ఏవో)గా పి.కృష్ణకుమార్, సికింద్రాబాద్ రెవెన్యూ డివిజన్ ఆఫీస్ ఏఓగా జే.బుచ్చయ్యలకు పో

కాంగ్రెస్‌లో చేరిన అల్వాల్ మాజీ మున్సిపల్ చైర్మన్

అల్వాల్, ఆగస్టు 3 ప్రభాతవార్త: అల్వాల్ మున్సిపల్ మాజీ చైర్మన్ జీవకన్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. జాతీయ పార్టీ అధ్యక్షుడు ఖర్గే ఆయను పార్టీ కండువా కప్పి స్వాగతించారు. రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్ రెడ్డితో కలిసి ఆయన ఢిల్లీ వెళ్లడం జరిగింది. అల్వాల్ కౌన్సిల్ హాయాంలో ఆయన టిడిపి తరుపున చైర్మన్‌గా ఎన్నిక య్యారు. రాష్ట్ర విభజన అనంతరం బిఆర్ఎస్‌కు దగ్గరగా ఉండడం అనంతరం బిజెపిలోకి వెళుతున్నారనే ప్రచారం జరిగింది. ఆఖరికి ఆయన కాంగ్రెస్ పార్టీ తీర్థం తీసుకున్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గంనుంచి పోటీ చేయాలనే ఆలోచనలో జీవకన్ ఉన్నారు.

నులి పురుగుల నివారణ దినోత్సవం

విద్యార్థులతో కార్పొరేటర్ సబిత అనీల్ కిషోర్

అల్వాల్, ఆగస్టు 3 ప్రభాతవార్త: నులి పురుగులు నివారణ దినోత్సవాన్ని వెంకటాపురం కార్పొరేటర్ సబిత అనీల్ కిషోర్ ప్రారంభించారు. డివిజన్ పరిధిలోని సుభాష్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నులి పురుగులు నివారణతో పాటుగా కండ్ల కలక వాతావరణ మార్పులు నేపథ్యంలో వచ్చే అనారోగ్యాలు గురించి అవగాహన కల్పించారు. పౌష్టికాహారం సరైన సమయంలో మందులు వాడడం ద్వారా వ్యాదులు నుంచి బయట పడే అవకాశాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజేందర్, ఉమ, బాలామణి బిఆర్ఎస్ నేతలు అనీల్ కిషోర్, మోసిన్, భాస్కర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

బోర్‌వెల్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

నాచారం, అగస్టు 3 ప్రభాతవార్త: నాచారంలోని సీడిఎస్ భవనం ఆవరణలో బోర్‌వెల్ పనులను గురువారం కార్పొరేటర్ శాంతిసాయిజన్ శేఖర్ ప్రారంభించారు. సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు మినిస్టరి ఆఫ్ జల్ శక్తి డిపార్ట్‌మెంట్ ఆఫ్ రీసర్చ్ హైడ్రో జియోలజీస్ట్ పరిశోధన నిమిత్తం సీడీఎస్ ఆవరణలో బోర్‌వెల్ పనులను కార్పొరేటర్ ముఖ్య అతిథులుగా హాజరై పారంభించారు. ఈ కార్యక్రమంలో జై హనుమాన్ యూత్ అసోసియేషన్ ప్రసిడెంట్ శ్రీనివాస్, మాజీ ప్రసిడెంట్ అంజయ్య గౌడ్, ఐ.రమేష్ గౌడ్, ఎస్.సంజీవ్, ఎస్.రాజు, సలహాదారులు బిక్షపతి గౌడ్, లడ్డు, శివరాం, జి.శ్రీనివాస్ గౌడ్, సభ్యులు ముత్యం రెడ్డి, విఠల్ యాదవ్, అంజి,దాసరి కర్ణ, రాంచందర్, మంగోల్, శివకుమార్,రవికుమార్, చంద్రశేఖర్, కట్టబుచ్చన్న గౌడ్, బాల్‌రాజ్,హరిప్రసాద్, శంకర్, కెప్టెన్ లడ్డు, రాజేష్ గౌడ్,శివ దత్తు, జాయిజన్ శేఖర్ తధితరులు పాల్గొన్నారు.

మంజీరా నీటి లైన్ పనుల పరిశీలన

పైపులైన్ పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్

నిజాంపేట, ఆగస్టు 3 ప్రభాతవార్త : నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రెడ్డి ఎవెన్యూ, పాత గ్రామంలో కొనసాగుతున్న మంజీరా నీటి పైపులైన్ పనులను గురువారం డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పైపులైన్ పనులను సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత గుత్తేదారు, అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈ ధీరజ్, ఇంజినీర్ అరుణ్, నాయకులు ధశరథ్, హరినారాయణ, కాలనీవాసులు నాగిరెడ్డి, రమేష్, శివకుమార్, మాధురి, రజిత, తేజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు విద్యాపరంగా అభివృద్ధి చెంది బహుళ జాతి కంపెనీల్లో ఉద్యోగాలు సాధించాలి

మన్నెక్రిషాంక్

5వ వార్డు మారేడ్‌పల్లి 8వ షీటాక్స్‌లో మన్నెక్రిషాంక్

కంటోన్మెంట్, అగస్టు 3 ప్రభాతవార్త: విద్యావంతులైన యువతులు విదా ్యరంగా అభివృద్ధి చెంది బహుళ జాతి కంపెనీల్లో ఉపాధి అవకాశాలు సాధించి సమాజాభివృద్ధి కోసం పాటుపడాలని తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కారో ్పరేషన్ చైర్మన్ మన్నెక్రిషాంక్ తెలిపారు. గురువారం కంటోన్మెంట్ 5వ వార్డు వెస్ట్ మారేడ్‌పల్లిలో నిర్వహించిన 8వ సీటాక్స్ కార్యక్రమాన్ని నిర్వహించి వారి సాదక బాధకాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో యువతులు మౌనిక, మానస, మంజూ, పూజా, సమ్రిన్, వైష్ణవి, ఉదయశ్రీ, రాజేశ్వరీ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే వివేకానంద్

సిసిరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 3 ప్రభాతవార్త : 95వ రోజు ప్రగతియాత్రలో భాగంగా సూరారం డివిజన్‌లోని పలు కాలనీలలో గురువారం ఎమ్మెల్యే వివేకానంద్ పర్యటించారు. ఈసందర్భంగా కళావతినగర్, టిఎస్ఐఐ ఐసికాలనీలతో రూ,84.10లక్షల నిధులతో సిసిరోడ్డు పనులకు, శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ కమాన్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేయడంతో పాటు తన సొంత ఖర్చులో ఏర్పాటు చేసిన బోరుబావిని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గడిచిన తొమ్మిది సంవత్సరాల కాలంలో కోట్లాది రూపాయలు వెచ్చించి ఆయా డివిజన్లలో అనేక అభివృద్ధి పనులు చేశామన్నారు. ప్రజాసౌకర్యమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎండిడ్ల్యూఎస్ జిఎం శ్రీధర్‌రెడ్డి, డీఈఈ శిరిషీ, ఏఈ సంపత్, డివిజన్ అధ్యక్షులు భాస్కర్, సెక్రటరీ సిద్దిక్, నాయకులు సురేష్‌బాబు, గిరిధర్, మధుమోహన్, రెహ్మాన్, నేతిరాజు, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన తహసీల్దార్ సుచరిత.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి గండిమైసమ్మ-దుండిగలన మండలం నూతన తహసీల్దార్‌గా డి.సుచరిత బాధ్యతలు చేపట్టారు. ఈమేరకు గురువారం ఆమె ఎమ్మెల్యే వివేకానంద్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద్ తహాసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలియజేసి, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి ఫిర్యాదులను త్వరితంగా పరిష్కరించాలని సూచించారు.

ఆలయాల అభివృద్ధికి సహకరిస్తా : కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి

ధ్వజస్థంభం ఏర్పాటుకు రూ,4.25లక్షల విరాళం అందజేత

ఆలయకమిటి సభ్యులకు విరాళం అందజేస్తున్న కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

దుండిగల్, ఆగస్టు 3 ప్రభాతవార్త : దుండిగల్ మున్సిపాలిటీ పరిధి భౌరంపేటలోని భ్రమరాంబిక మల్లికార్జునస్వామి(భౌరమ్మ గుడి) ఆలయంలో ధ్వజస్థంభం ఏర్పాటు అయ్యే మొత్తం ఖర్చు రూ,4.25 లక్షల రూపాయలను కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి విరాళంగా అందజేశారు. ఈమేరకు గురువారం ఆలయకమిటి సభ్యులకు సంబంధిత చెక్కు ను ఆయన అందజేశారు. ఈసందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని అతిపూరతమైన భౌరమ్మ ఆలయంలో ధ్వజస్థంభం ఏర్పాటు చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ఆలయాల అభివృద్ధికి సహకరించేందుకు ఎల్లప్పుడు ముందుంటానని పేర్కొన్నారు. ఆలయాల అభివృద్ధిలో పాలుపంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి అధ్యాత్మికతను పెంపొందించుకొని, ఆలయాలను సందర్శించాలని సూచించారు. కార్యక్ర మంలో ఆలయపూజారి పవన్‌శర్మ, గ్రామ పెద్దలు మల్లారెడ్డి, కైలాష్, అంజయ్య, నాయ కులు బుచ్చిరెడ్డి, ఆలయకమిటి అధ్యక్షులు సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు శంకరప్ప, బింగి నాగరాజు, ప్రధానకార్యదర్శి మన్నే శేఖర్‌ముదిరాజ్, కోశాధికారి ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

సాంకేతికతతో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి

తెలంగాణ ఉన్నత విద్యామంలలి వైస్‌చైర్మన్ ప్రొఫెసర్ ఎస్‌కె.మహమూద్

జ్యోతిని వెలిగించి ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ ఎస్‌కె.మహమూద్, చిత్రంలో ప్రియాంక తదితరులు

హైదరాబాద్, ఆగస్టు 3 ప్రభాతవార్త: బయోలాజికల్ క్లాక్ ప్రకారం సాంకేతికత ద్వారా ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని తెలంగాణ ఉన్నత విద్యామంలలి వైస్‌చైర్మన్ ప్రొఫెసర్ ఎస్‌కె.మహమూద్ అన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో అవంతి డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో 'ప్రతిష్ట-2K23' కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ ఎస్‌కె. మహమూద్ హాజరై ప్రసంగించారు. విద్యార్థులు క్రమశిక్షణతో పాటు సేవా ఆధారితంగా ఉంటూ ఎన్‌సీసీ,ఎన్ఎస్ఎస్‌లో చేరాలని కోరారు. ముఖ్యంగా కళాశాల విద్యార్థులకు కళాశాల యాజమాన్యం అప్రెంటిస్‌షిప్ అందించాలనని, అదే విధంగా విద్యార్థులు చదువుకుంటూనే పరిశోధనలపై దృష్టిని సారించాలన్నారు. అవంతి విద్యాసంస్థల ప్రధాన కార్యదర్శి ప్రియాంక, డైరెక్టర్(హెచ్ఆర్) జయప్రద, డైరెక్టర్ డాక్టర్ డి.వెంకటరావు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వీర సోమయ్య, కళాశాల హెచ్ఓడీలు, వివిధ విభాగాల బోధనా సిబ్బంది పాల్గొన్నారు. లెఫ్టినెంట్ కల్నల్ సంజీవ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి : ఎమ్మెల్యే మాధవరం

ఓల్డ్‌బోయిన్ పల్లి పాదయాత్రలో ఎమ్మెల్యే మాధవరంకు హారతి పడుతున్న మహిళలు

బేగంపేట ఆగస్టు 3,ప్రభా తవార్త : ఓల్డ్ బోయిన్ పల్లి 119 డివిజన్ పాదయాత్రలో భాగంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణా రావుకు మహిళలు హారతులు పట్టి బ్రహ్మరథం పట్టారు. ఉదయం గం 7.30నిలకు కోయబస్తీ ఆలయం వద్ద నుంచి ఆయన పాదయాత్ర నిర్వ హించారు. అక్కడి నుంచి లయన్ టౌన్ కాలనీ,సిక్కుబస్తీ,వడ్డెర బస్తీ,హరిజన బస్తీ,గౌడబస్తీ,తదితర బస్తీల్లో పాదయాత్ర నిర్వహించారు ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాల గురించి ఎమ్మెల్యే మహిళలను ఆరాతీసారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలకు ప్రభుత్వం ఎన్నో రకాలైన సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి అమలు చేస్తుందన్నారు. కేసీఆర్ కిట్ మొదలు కొని,కళ్యాణలక్ష్మి,షాదీముబారక్ వంటి ఎన్నో పథకాలు,వీటితో పాటు మహిళలకు పింఛన్లు అందజేస్తున్న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావును ప్రజలంతా మరో సారి ఆశీర్వదించి ముఖ్యమంత్రి ని చేయాలని మహిళలను కోరారు.

నాణ్యతలేని పుట్‌పాత్ మరమ్మత్తులతో ప్రజా ధనం వృధా

అడ్డగుట్ట,ఆగస్టు 3 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గం మోండా డివిజన్‌లోని ఈస్ట్ మారేడ్‌పల్లి టీచర్ ్స కాలనీలో జిహెచ్ఎంసి ఇంజనీర్ల పర్యవేక్షణ లేకుండా, నాణ్యత ప్రమాణాలు పాటించకుండా కాంట్రాక్టర్లు తమ ఇష్టాను సారంగా పుట్‌పాత్‌లపై కాంక్రీట్‌తో మరమ్మత్తులు చేపట్టారు. పుట్‌పాత్‌లపై ఉన్న మట్టిని తొలగించకుండా, మట్టిని దిమ్మిసెతో కొట్టకుండా కాంక్రీట్ వేశారు. ఇంజనీర్ల పర్యవేక్షణ లేకుండా,నాణ్యత ప్రమాణాలు పాటించకుండా పుట్‌పాత్‌ల మరమ్మత్తులు చేపట్టడంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృధా అవుతుంది.

కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కౌన్సిలర్ శంభీపూర్‌క్రిష్ణ

దుండిగల్, ఆగస్టు 3 ప్రభాతవార్త : రైతులకు పంట రుణమాఫీ కార్యక్రమం పున:ప్రారంభించాలని సిఎం కెసిఆర్ ఆదేశాలను హర్షిస్తూ గురువారం భౌరంపేట ప్రాథమిక వ్యవసాయ కో-ఆపరేటీవ్ సొసైటీ కార్యాలయం వద్ద కెసిఆర్ చిత్రపటానికి కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణ మాఫీ పథకం ద్వారా 29.61లక్షల రైతు కుటుంబాలకు లబ్ది చేకూరుతుం దన్నారు. ఇప్పటికే రైతులకు రూ,17,351కోట్ల రుణమాఫీలు జరగాయని త్వరలో రూ,19వేల కోట్ల రూపాయాల రుణమాపీ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఫాక్స్ చైర్మన్ బాల్‌రెడ్డి, కౌన్సిలర్లు శంకర్‌నాయక్, సాయి యాదవ్, సీనియర్ నాయకులు బుచ్చిరెడ్డి, మురళీయాదవ్, విష్ణువర్తన్‌రెడ్డి, ఫాక్స్ డైరెక్టర్లు జీతయ్య, కిష్టయ్య, వెంకటేష్, మహిపాల్, బిఆర్ఎస్ మున్సిపల్ కార్యదర్శులు రంగయ్య, మల్లేష్, నాయకులు పాల్గొన్నారు.

రైతన్నలకు శుభవార్త చెప్పిన కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

కెపిహెచ్‌బి కాలనీ.. తెలంగాణ రైతాంగ సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని తెలియజేస్తూ ముఖ్యమంత్రి కెసిఆర్ రైతన్నలకు గుడ్‌న్యూస్ చెప్పి, రైతులకు రుణమాఫి చేయాలని అధికారులను ఆదేశించిన సందర్భంగా ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం ఎల్లమ్మబండ చౌరస్తాలో బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి సీఎం కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సీఎం కెసిఆర్ రైతు బిడ్డగా, రైతుల పక్షాన నిలబడి, రైతన్నల కోసం రుణమాఫిని తీసుకువచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో సమ్మారెడ్డి, శ్రీనివాస్, జి.శ్రీనివాస్, శివరాజ్ గౌడ్, కరీమ్, షౌకత్ అలీముస్నా, కైసర్, రాములుగౌడ్, పోశెట్టిగౌడ్, యాదగిరి, హరీష్, వీరేశం, రాజుపటేల్, జగదీష్, నాగేశ్వరరావు, మహేష్, సాయిగౌడ్, కూర్మయ్య, బాలరాజు, మారుతి, నాగరాజు, సలీమ్, కె.శ్రీనివాస్, బాబు తదితరులు పాల్గొన్నారు.

పాలాభిషేకం నిర్వహిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

పిల్లల సంరక్షణలో తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలి

పిల్లలకు ఆల్బెండజోల్ టాబ్లెట్స్‌లను ఇస్తున్న కార్పొరేటర్ రోజాదేవి

కార్పొరేటర్ మాధవరం రోజాదేవి

కెపిహెచ్‌బి కాలనీ, ఆగస్టు 3, ప్రభాతవార్త : శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని వివేకానందనగర్ డివిజన్ పరిధిలో గల వెంకటేశ్వరనగర్ ప్రాథమిక పాఠశాలలో ఆరోగ్యవంతమైన పిల్లల కోసం ఆల్బెండజోల్ టాబ్లెట్స్‌లను కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు గురువారం పంపిణీ చేశారు. తదనంతరం స్కూల్లో ఉన్న పరిసరాలను, అంగన్‌వాడి కేంద్రాన్ని తనిఖీ చేసి, రిజిస్టర్‌లో ఉన్న ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి గర్భిణీ స్త్రీలకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని, పాలు, గుడ్లు సకాలంలో అందిస్తున్నారా లేదా అని తెలుసుకున్నారు. పిల్లలకి ఇచ్చేటప్పుడు బాలామృతం పిండిని స్వయంగా తిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంజీవరెడ్డి, హరినాథ్, ఆంజనేయులు, శ్రావణ్‌రెడ్డి, స్వరూప, బారతమ్మ, కమలమ్మ, చంద్రమోహన్‌సాగర్, విద్యాసాగర్, శివసాగర్, లక్ష్మీ నరసయ్య, భీమ్‌రావ్, సోమేష్, బాబు, శ్యామ్, రమేష్, రాంచందర్, వెంకటేష్, శంకర్‌గౌడ్, చారి, నరసింహాగౌడ్, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి

తార్నాక, అగస్టు 3 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యూలరైజ్ చేయాలని కోరుతూ గురువారం ఓ.యూ ఆర్ట్స్ కాలేజ్ నుంచి సీఎం కేసీఆర్ మొక్కులు తీర్చుకునే సిద్దిపేట జిల్లా కోయినపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు అధ్యాపకులు పాద యాత్ర ప్రారంభించారు. అయితే అనుమతి లేదంటూ పోలీసులు అధ్యాపకులను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆల్ యూనివర్సీటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ జేఏసీ వర్కింగ్ చైర్మన్ డా.ఎం.రామేశ్వర్ రావు, తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్ జేఏసీ చైర్మన్ డా. శ్రీధర్ కుమార్ లోద్ మాట్లాడుతూ గత 80 రోజులుగా విశ్వవిద్యాలయాల్లో అనేక రకాలుగా ధర్నాలు పోరాటాలు సదస్సులను నిర్వహిస్తున్నాము కాని ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం బాధ కల్గిస్తుందన్నారు. తెలంగాణ ఆల్ యూనివర్సీటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ జేఏసీ ఆద్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ పల్లా రేష్మారెడ్డి, జేఏసీ కో చైర్మన్ జరుపుల చందులాల్, ఆర్.డి ప్రసాద్, డా. విజయ్‌కుమార్, కే.హరీష్, డా. అశోక్, డా. కృష్ణమూర్తి, డా. కిరణ్, ప్రేమ్, సుజాత, వాణి, రవీందర్ రెడ్డి తధితరులు పాల్గొన్నారు.

కార్మిక నేత రాజు సేవలు మరువలేనివి

సైఫాబాద్, ఆగస్టు 3 ప్రభాతవార్త: హైదరాబాద్ మున్సిపాలిటిలో కామాటి కార్మికుడిగా విధుల్లోకి చేరిన ఎఐటియుసి మున్సిపల్ సీనియర్ నాయకుడు బి.రాజు కార్మికుల హక్కులు, డిమాండ్‌లు సాధన కోసం విశేషంగా కృషి చేశారని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఏసురత్నం కొనియాడారు. గురువారం లిబర్టి వద్ద గల గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్యాలయంలో జరిగిన రాజు సంతాప సభలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ కార్మికుల పర్మినెంట్ కోసం, జీతభత్యాలు పెంపుదల కోసం, శానిటేషన్ కార్మికుల, ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు, పార్కుల్లో పనిచేసే కార్మికుల సమస్యల కోసం ఎన్నో పోరాటాలను ఆయన నిర్వహించి, విజయం సాధించారన్నారు.

మంత్రి కల్వకుంట్ల తారక రామారావును కలిసి బొకె అందచేస్తున్న గోషామహల్ నియోజక వర్గం బిఆర్ఎస్ యువ నాయకులు గడ్డం ఆశీష్‌కుమార్‌యాదవ్ తదితరులు

దేశాన్ని నులి పురుగుల రహిత దేశంగా మార్చుదాం

డాక్టర్ మనోజ్‌రెడ్డి పిలుపు

నులిపురుగులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఎం.మనోజ్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 3 ప్రభాతవార్త: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని సుల్తాన్ బజార్ లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బృందం గురువారం సమీప పాఠశాలలకు వెళ్ళి విద్యార్తులకు నులిపురుగుల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.మనోజ్‌రెడ్డి పాఠశాలల్లో విద్యార్థులకు పూర్తిగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులి పురుగులు ఉన్న పిల్లలు పోషకాహార లోపం, రక్తహీనతలతో ఎప్పుడు అలసటగా ఉంటారని, శారీరక పెరుగుదల, మానసిక అభివృద్ధిలో మందకొడిగా ఉంటారని విచారం వ్యక్తం చేశారు. పిల్లలకు నులిపురుగులు రాకుండా సులభంగా నియంత్రవచ్చనని సూచించారు. 1 నుంచి 19 సంవత్సరాల వయసు ఉన్న పిల్లలందరికి ఆల్బెండజోల్ టాబ్లెట్‌ను వేసుకోవాలని, ఈ టాబ్లెట్ ప్రతి పాఠశాల, కళాశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాలలో ఉచితంగా ఇవ్వబడతాయన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ నర్సుబాయి, ఎఎన్ఎంలు జయ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు ఆరోగ్యవంతంగా ఉండటానికి కృషి చేయాలి

విద్యార్థులకు టాబ్లెట్స్ పంపిణి చేస్తున్న మహాలక్ష్మీరామన్‌గౌడ్

హైదరాబాద్, ఆగస్టు 3 ప్రభాతవార్త: పిల్లలు ఆరోగ్యవంతంగా ఉండటానికి తల్లిదండ్రులు కృషి చేయాలని హిమాయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మి రామన్‌గౌడ్ సూచించారు. పిల్లలు ఆరోగ్యంగా ఉంటెనే ఏదైనా సాధించగలుగుతారని చెప్పారు. నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం బోగ్గులగుంటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని బృందం కింగ్ కోఠిలోని సెయింట్ జోసెఫ్ పబ్లిక్ స్కూల్‌లో నులిపురుగుల నిర్మూలనపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. స్కూల్ విద్యార్థులకు టాబ్లెట్స్ పంపిణి చేశారు. నులి పురుగులు పిల్లల ఎదుగుదలకు ఆటంకం కలిగిస్తాయని, పిల్లలను ఉత్సహవంతంగా కాకుండా నిరసంగా చేస్తాయని, ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటే మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దీప్తి ప్రియాంక, ఎఎన్ఎం జయలక్ష్మి, అశా వర్కర్ స్వప్న, ప్రకాష్, స్కూల్ ప్రిన్సిపల్ రెబెక్కా, వై.వి.రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

గండిపేట మండల నూతన తహసీల్దార్ ఆర్.గోవర్ధన్

నార్సింగి, ఆగస్టు 3 ప్రభాతవార్త : గండిపేట మండల పరిధిలోని ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానని నూతన తహసీల్దార్ ఆర్.గోవర్ధన్ తెలిపారు. ఇన్నాళ్లు గండిపేటలో పని చేసిన రాజశేఖర్ రంగారెడ్డి జిల్లా కార్యాలయంకు బదిలీ అవగా ఆయన స్థానంలో కూకట్‌పల్లిలో పని చేసిన గోవర్ధన్‌ను గండిపేటకు బదిలీ చేశారు. గురువారం గండిపేట మండల కార్యాలయంలో గోవర్ధన్ మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ భూములు కాపాడేందుకు ప్రణాళిక బద్ధంగా పని చేస్తామన్నారు. ప్రభుత్వ భూములను ఎవరైనా కబ్జా చేసేందుకు యత్నిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహిస్తానని నూతన తహసీల్దార్ గోవర్ధన్ తెలిపారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో రాణించాలి: రాజేశ్వర్‌రెడ్డి

రాహుల్‌ను అభినందిస్తున్న చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి

మలక్‌పేట, ఆగస్టు 3 ప్రభాతవార్త : విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో కూడా రాణించాలని నోబెల్ విద్యాసంస్థలు నవ్య జూనియర్ కళాశాల చైర్మన్ ఆర్.రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. నవ్య జూనియర్ కళాశాల విద్యార్థి క్రీడలో జిల్లా మొదటి స్థానంలో గెలుపొందడం పట్ల రాజేశ్వర్‌రెడ్డితో పాటు ప్రిన్సిపాల్ రేవతివిటల్, అధ్యాపకులు రాహుల్ను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. తమ విద్యా సంస్థలలో చదువుతున్న విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించడంతోపాటు క్రీడలలో కూడా ప్రోత్సాహాన్ని అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కొప్పుల చందుగౌడ్, రాకేష్, రమేష్, వరలక్ష్మి, ప్రశాంతి పాల్గొన్నారు.

చేతల్లో చేసి చూపించడం కెసిఆర్‌కె చెల్లు

ఆరెమైసమ్మ ఆలయం చౌరస్తాలో సీఎం కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న బండ్లగూడ మేయర్ మహేందర్‌గౌడ్ తదితరులు

నార్సింగి, ఆగస్టు 3 ప్రభాతవార్త : రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు రూ.లక్ష వరకు రుణమాఫీ చేసి మాది రైతు ప్రభుత్వమని నిరూపించారని బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం

రాజ్యాధికార సాధన కోసం చలో కోరుట్ల

ఆర్ట్స్ కాలేజ్ ముందు పద్మశాలి రాజకీయ యుద్ధభేరి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పద్మశాలి కులస్థులు

పద్మశాలి రాష్ట్ర అధ్యక్షులు రామ శ్రీనివాస్

తార్నాక, ఆగస్టు 3 ప్రభాతవార్త: రాజ్యాధికార సాదన కోసం ఛలో కోరుట్ల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామ శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. ఆగస్టు 13న కోరుట్లలో పద్మశాలి రాజకీయ యుద్ధ భేరి సభను నిర్వహిస్తున్నట్లు రమా శ్రీనివాస్ పేర్కొన్నారు. అందుకు సంబంధించి పద్మశాలి సంఘం ఆద్వర్యంలో రూపొందించిన వాల్‌పోస్టర్‌ను గురువారం ఆర్ట్స్ కాలేజ్ ముందు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన అధ్యక్షులు రామ శ్రీనివాస్, పద్మశాలి సంఘం రాష్ట్ర కన్వీనర్ బూర మల్లేషం, పద్మశాలి నేతలు కౌలాష్ నేత, బాలకృష్ణ నేత, రాజు నేత మాట్లాడుతూ రాష్ట్రంలో పద్మశాలిల సామాజిక వర్గం యొక్క ఐక్యతను, బలప్రదర్శనను నిరూపించుకునేందుకు అందరు రాజకీయాలకు అతీతంగా కదలిరావాలని విజ్ఞప్తి చేశారు. అందరు రాజకీయ పార్టీలకు అతీతంగా రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుండె శంకర్ నేత, నాగేష్ నేత, డా. రవీందర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

సెంట్రింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ నాయకులు కృషి చేయాలి

గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్

ధర్నాచౌక్, ఆగస్టు 3, ప్రభాతవార్త: గ్రేటర్ హైదరాబాద్‌లో సెంట్రింగ్ కార్మికులు, కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికై బీఆర్ఎస్ నాయకులు కృషి చేయాలని గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పి.కృష్ణ, ఛైర్మన్ పరశురాంరెడ్డి, ప్రధానకార్యదర్శి చాంద్‌పాషా, కోశాధికారి సి.విష్ణువర్ధన్‌రెడ్డిలు కోరారు. గురువారం కవాడిగూడలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన సెంట్రింగ్ కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో కార్మికులు మరణిస్తే పోలీస్ స్టేషన్‌లో నమోదయిన ఎఫ్ఐఆర్ ఆధారంగా వారి కుటుంబానికి నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. కార్మికులకు ఈఎస్ఐ, ఉచిత బస్సు రవాణా సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేయాలని కోరుతూ మంత్రి మల్లారెడ్డి, కుకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావులకు వినతి పత్రాలు అందచేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు నీలయ్య, కుంటయ్య, సతీష్, లింగమయ్య, మల్లేష్‌జోన్ తదితరులు పాల్గొన్నారు.

గోషామహల్ కాంగ్రెస్ టిక్కెట్టు స్థానికులకే కేటాయించాలి

గోషామహల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుల తీర్మానం

గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు మధుసూధన్ గుప్త

గోషామహల్, ఆగస్టు 3 ప్రభాతవార్త: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో గోషామహల్ నియోజకవర్గానికి కాంగ్రెస్ నాయకులకే అసెంబ్లీ టిక్కెట్‌ను స్థానికులకే కేటాయించాలని నియోజక వర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ముక్త కంఠంతో తీర్మానం చేశారు. గురువారం దూల్‌పేట్‌లోని సీనియర్ నాయకులు గోకరన్ సింగ్ నివాసంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ముఖ్య నాయకులు, డివిజన్ల అధ్యక్షులు, కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మధుసూధన్ గుప్త మాట్లాడుతూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, ఎఐసిసి అధిష్టానం గోషామహల్ నియోజక వర్గం కాంగ్రెస్ టిక్కెట్ నియోజకవర్గానికి చెందినవారికి ఇవ్వాలని కోరారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే కాంగ్రెస్ నాయకులకు టిక్కెట్ కేటాయిస్తే తాము పని చేయమని తీర్మానం చేశారు. కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షులు సికె. మూర్తి, బి. కాంగ్రెస్ అధ్యక్షులు డి. రూపేష్‌సింగ్, గోకరన్‌సింగ్, రామ్‌రాజ్ సింగ్, బండ అశోక్, ఆర్. నరేం దర్, జితేందర్, కైలాష్‌సింగ్, నిర్మల్‌కుమార్ యాదవ్, కన్నయ్యలాల్ సాహు, కేవల్‌సింగ్, విజయ సారథి, అనిల్‌సింగ్ పలువురు కాంగ్రెస్ నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ నెలలో టిపిసిసి అధ్యక్షులు ఎ. రేవంత్‌రెడ్డిని కలిసి తాము చేసిన తీర్మాన వినతి పత్రాన్ని అందచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజల రక్షణే ప్రదాన లక్ష్యం

నూతన ఇన్స్‌పెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి

ఫిలింనగర్, ఆగస్టు 3, ప్రభాతవార్త : న్యాయానికి, ధర్మానికి లోబడి చట్టబద్ధంగా సామాన్య ప్రజలకు భద్రత కల్పిస్తూ, ప్రజల రక్షణే ప్రధాన లక్ష్యంగా పని చేస్తానని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఇన్స్‌పెక్టర్‌గా వెంకటేశ్వర్‌రెడ్డి, డిఐగా చంద్రశేఖర్‌లు పేర్కొన్నారు. గురువారం జూబ్లీహిల్స్ ఇన్స్‌పెక్టర్‌గా వెంకటేశ్వర్‌రెడ్డి, డిఐగా చంద్రశేఖర్‌లు నియమితులయ్యారు. ట్విన్ టవర్స్‌లో బాధ్యతలు నిర్వహించిన లా అండ్ ఆర్డర్ ఇన్స్‌పెక్టర్‌గా జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. అలాగే డిటెక్టివ్ ఇన్స్‌పెక్టర్‌గా కె. చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఈయన వనస్థలిపురం ట్రాఫిక్ ఎస్ఐగా పని చేసి పదోన్నతిమీద జూబ్లీహిల్స్ డిఐగా నియమితులయ్యారు. అదేవిధంగా ఎస్ఐలుగా గోపి, లక్ష్మీ నియమి తులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. పేద ప్రజలకు రక్షణగా ఉంటూ వారి సమస్యలను వెంటనే పరిష్కరిస్తూ, వారిపై జరుగుతున్న అన్యాయాలను అరికట్టేందుకు తమవంతు శాయశక్తుల కృషి చేస్తామని అన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

దుండిగల్, ఆగస్టు 3 ప్రభాతవార్త : విద్యుత్ తీగలకు అడ్డుతగులుతున్న చెట్ల కొమ్మలను తొలగించడంలో భాగంగా దొమ్మరపోచంపల్లి, బహదూర్‌పల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని పలు ప్రాంతాలలో శుక్రవారం (04-08-2023) విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ సురేందర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 11కెవి సత్యం ఫీడర్ పరిధిలోని గండిమైసమ్మ ఎక్స్‌రోడ్స్, సాయికృష్ణకాలనీ, సంతోష్‌దాబా పరిసర ప్రాంతాలలో ఉదయం 9గంల నుండి మధ్యాహ్నం 1గంల వరకు, 11కెవి కట్టమైసమ్మ ఫీడర్ పరిధిలోని సూరారం ఎక్స్‌రోడ్స్, మల్లారెడ్డి వైద్యశాల, సూరారం మార్కెట్ రోడ్, భవానినగర్, సూరారంకాలనీ వీడిఆర్ స్ట్రీట్ తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 2గంల నుండి సాయంత్రం 5గంల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. సమస్యను గుర్తించి వినియోగదారులు తమతో సహకరించాల్సిందిగా ఏఈ కోరారు.

నిజాంపేట.. ప్లేటవర్ పనులు జరుగుతున్న నేపథ్యంలో బాచుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాలలో శుక్రవారం (04-08-2023) విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. 11కెవి, ఎస్ఎంఎస్, నిజాంపేట ఫీడర్ల పరిధిలోని బాచుపల్లి సిగ్నల్ మెయిన్‌రోడ్ నుండి శిఖరవిల్లాస్ వరకు, శిఖరవిల్లాస్, ప్రభుత్వ పాఠశాల, కొత్త పోలీస్‌స్టేషన్, శ్రీనివాసలేక్‌వ్యూ తదితర ప్రాంతాలలో ఉదయం 10గంల నుండి సాయంత్రం 4గంల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. సమస్యను గుర్తించి వినియోగదారులు తమతో సహకరించాల్సిందిగా ఏఈ కోరారు.

ఎమ్మెల్సీ సీతక్కకు బిసి యువసేన రక్షక్‌దళ్ లక్షరూపాయల విరాళం

నాంపల్లి, ఆగస్టు 3 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీవర్షాలు, వరదలతో ములుగు నియోజకవర్గ ప్రాంతం అతలాకుతలమై ఆయా ప్రాంతాల్లో వేల కుటుంబాల బ్రతుకులు చిధ్రమైన, విద్యార్థుల పుస్తకాలు కొట్టుకుపోయి దురదృష్టకర దుస్థితిలో స్థానిక ఎమ్మెల్సీ సీతక్క వెనువెంటనే స్పందించి ఆయా ప్రాంతాలను స్వయంగా పరిశీలించి బాధితులకు ఆదుకోవడానికి నిర్విరామంగా చేస్తున్న సేవాకార్యక్రమాలకు ఆకర్షితులైన బిసి యువసేన రక్షక్ దళం సభ్యులు హైదరాబాద్‌లో సీతక్కను కలిసి లక్షరూపాయల ఆర్థిక సహాయాన్ని విరాళంగా అందించారు. ఈ ఆర్థిక సహాయాన్ని విద్యార్థులకు పుస్తకాలు అందించడానికి ఉపయోగిస్తానని సీతక్క హామీఇచ్చారని ఆమెను కలిసిన రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్, 26బిసి కులాల పోరాటసమితి అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ ఆధ్వర్యంలోని బిసి యువసేన జాతీయ సమన్వకర్త మురళీ రామకృష్ణారెడ్డితోపాటు రక్షక్‌దళ్ సభ్యులు రమణమూర్తి, వెంకరమణ, నాగార్జున రాజు, బాలకృష్ణ తదితరులు తెలిపారు.

కెసిఆర్ నాయకత్వంలో గుణాత్మక అభివృద్ధి: ఎమ్మెల్యే

ఎల్.బి.నగర్, ఆగస్టు 3 ప్రభాతవార్త: తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపి, గుణాత్మక ప్రగతి కార్యాచరణను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నారని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమ నిర్ణయాల నేపథ్యంలో ప్రజల నుంచి కూడా అపూర్వస్పందన లభించిందన్నారు.

సిఎం కెసిఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే సాయన్న కూతుర్లు

ముఖ్య మంత్రి కేసిఆర్‌కు అభినందనలు తెలుపుతున్న దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతుర్లు లాస్య నందిత, నివేదిత, చిత్రంలో మంత్రి తలసాని

కంటోన్మెంట్, ఆగస్టు 3 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే జి.సాయన్న 4 నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా గురువారం దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతుర్లు రాష్ట్ర ముఖ్య మంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. సిఎంను కలిసిన వారిలో రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, నగర ఎమ్మెల్యే లు ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, దానం నాగేందర్, మాధవం క్రిష్ణారావ్‌లు కలిశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలో కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి బిఆర్ఎస్ అభ్యర్థిగా తమ కుటుంబానికి అవకాశం కల్పించాలని సాయన్న కూతుర్లు సిఎం కేసిఆర్‌కు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

ఆఫ్కోకాలనీలో కార్పొరేటర్ పర్యటన

బస్తీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, ఆగష్టు 3 ప్రభాతవార్త : మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ఆఫ్కోకాలనీలో గురువారం కార్పొరేటర్ జిహెచ్ఎంసి కౌన్సిల్ విప్ తోకల శ్రీనివాస్‌రెడ్డి పర్యటించారు. కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్లు పనులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న రహదారి మరమ్మతుల పనులు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ పైపు లైన్ పనులతో పాటు బస్తీ దవాఖానాలోని మౌళిక సదుపాయాల కోసం బిజెపి నాయకులు, కాలనీ వాసులతో కలిసి ఆయన పర్యటించారు. ఈసందర్భంగా కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతీ రోజు బస్తీలలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను పరిష్కరించటానికి నిత్యం కృషి చేస్తున్నానని తెలిపారు. జిహెచ్ఎంసి వర్క్ ఇన్‌స్పెక్టర్ భాను, వాటం వర్క్స్ అధికారి వినయ్, బుచ్చిరెడ్డి, తిరుపతమ్మ, శాంతమ్మ, సురేష్, రవి, సోనీ, నరేష్, శ్రీకర్ పంతులు, టి. చిన్న, శ్రీకాం త్‌రెడ్డి, పాండు యాదవ్, సిహెచ్ ప్రభుదాస్, కుమార్, అవి నాష్ బస్తీ వాసులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియ వేగవంతంగా చేయాలి

కమిషనర్ సత్యనారాయణరావు

దుండిగల్, ఆగస్టు 3 ప్రభాతవార్త : ఎన్నికల ప్రక్రియను వేగవంతంగా చేయాలని దుండిగల్ మున్సిపల్ కమీషనర్ సత్యనారాయణరావు అన్నారు. జిల్లా కలెక్టర్, ఇఆర్‌వో కుత్బుల్లాపూర్ ఆదేశానుసారం ఎన్నికలకు సంబంధించి గురువారం బిఎల్‌వోలు, సూపర్‌వైజర్‌లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ ఆన్‌లైన్‌తో పాటు ధరఖాస్తు ద్వారా వచ్చిన ఫారం-6, 7, 8, 8ఏలను పరిశీలించి త్వరితగిన ఇఆర్‌వోకు సమర్పించాలన్నారు. అదే విధంగా రేపటి నుండి 18సంవత్సరాలు నిండిన వారికి ఓటరు నమోదు కోసం రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్స్, గేటేడ్ కమ్యూనిటీలు, 50ఫ్లాట్స్ పైగా ఉన్న అపార్ట్‌మెంట్‌లలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మేనేజర్ టి.నర్సింహులు, బిఎల్‌వోలు, సూపర్‌వైజర్స్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు తొలి ప్రాధాన్యత

నార్సింగి మున్సిపల్ వైస్ ఛైర్మన్ వెంకటేష్ యాదవ్

నార్సింగి, ఆగస్టు 3 ప్రభాతవార్త : నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో మౌళిక వసతుల కల్పనకు తొలి ప్రాధాన్యతనిస్తున్నామని వైస్ ఛైర్మన్ గొర్ల వెంకటేష్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 7.వ.వార్డు పరిధిలో రూ.30.లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను స్థానిక కౌన్సిలర్ అరుణజ్యోతి యాదవ్‌తో కలిసి వెంకటేష్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని చేతలలో చేసి చూపిస్తున్నామన్నారు. ఏ ప్రజలు తమ విలువైన ఓట్లు వేసి మాకు అధికారంను అప్పగించారో, ఆ ప్రజల ఇబ్బందులను వారిచ్చిన అధికారంతోనే నిధులు తీసుకువచ్చి తీరస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అమ్మవారికి రెండవవారం సాక సమర్పించేందుకు పెద్ద ఎత్తున తరలి రావాలి

ఉజ్జయినీ మహాకాళీ ఆలయ ఈఓ గుత్తా మనోహర్‌రెడ్డి

బేగంపేట, ఆగస్టు 3 ప్రభాతవార్త: నేడు అమ్మ వారికి సాక సమర్పించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి రావాలని, ఆలయ ఈ ఓ గుత్తా మనోహర్ రెడ్డి తెలియజేసారు. శీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆషాడ బోనాల జాతర సందర్భంగా నిర్వహించిన రంగం కార్యక్రమంలో అమ్మ వారు తనకు ఐదు వారాల పాటు సాక సమర్పించాలని కోరిన నేపథ్యంలో మొదటి శుక్రవారం వెయ్యిమంది మహిళా భక్తులు అమ్మ వారి కి సాక సమర్పించారు. నేడు రెండవ శుక్రవారం కావడంతో ఉదయం గం 9.30నిలకు భక్తుల సమక్షంలో సాక సమర్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి వేలాదిగా భక్తులు తరలి వచ్చి అమ్మ వారికి సాక సమర్పించి అమ్మ వారి కృపకు పాత్రులు కావాలని ఈ ఓ గుత్తా మనోహర్ రెడ్డి కోరారు.

టీఎస్ ఆర్టీసీ విలీనం వెనుక రాజకీయ కుట్ర

టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా

సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబా

ధర్నాచౌక్, ఆగస్టు 3, ప్రభాతవార్త: టీఎస్ ఆర్‌టీసీని ప్రభుత్వంలో విలేనం చేయటం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా ఆరోపించారు. గురువారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీకి ప్రభుత్వం బకాయి ఉన్న 1600 కోట్లలను ఎగవేసేందుకు, రాబోయే ఎన్నికలలో ఓట్లు దండుకునేందుకు విలీనం అనే కొత్త నాటకానికి నాంది పలుకుతున్నారని మండిపడ్డారు. నిన్నటి దాకా విలీనంకు పూర్తి వ్యతిరేకంగా మాట్లాడిన సీఎం కేసీఆర్ ఆకస్మాత్తుగా విలీనం చేయటం కేవలం ఆర్టీసీకి తెలంగాణ వ్యాప్తంగా ఉన్న వేలకోట్ల ఆస్తులను అమ్ముకుని కమీషన్లు దండుకునే ప్రయత్నంలో భాగమేనని, ఆర్టీసీ మనుగడను అంతమొందించటమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, సత్యనారాయణ, ఎల్.రవిగౌడ్, యాదగిరి పాల్గొన్నారు.

బిఆర్ఎస్‌తోనే గోషామహల్ నియోజకవర్గం అభివృద్ధి

ఆపార్టీ ఇన్‌చార్జ్ నందకిషోర్‌వ్యాస్ బిలాల్

గన్‌ఫౌండ్రి డివిజన్ బిఆర్ఎస్ మహిళా సమావేశంలో పాల్గొన్న ఇన్‌చార్జ్ నందకిషోర్‌వ్యాస్, బిఆర్ఎస్ నాయకులు ఎస్.ధన్‌రాజ్‌మాదిగ, శీలం సర్వసతి తదితరులు

గన్‌ఫౌండ్రి, ఆగస్టు3 ప్రభా తవార్త: బిఆర్ఎస్‌తోనే గోషామహల్ నియోజకవర్గం అభివృద్ధి జరుగుతుందని ఇన్‌చార్జ్ నందకిషోర్ వ్యాస్ బిలాల్ అన్నారు. ఈ మేరకు గోషామహల్ నియోజక వర్గం బిఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు శీలం సర్వసతి అధ్యక్షతన గన్‌ఫౌండ్రి డివిజన్ మహిళా బిఆర్ఎస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నందకిషోర్‌వ్యాస్ సమక్షంలో పలువురు మహిళాలు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలను కప్పారు. ఈ సందర్భంగా నందకిషోర్‌వ్యాస్ మాట్లాడుతూ తొమ్మిదిన్నర సంవత్సరాల కాలంలో ఎమ్మెల్యే టి.రాజాసింగ్ సరైన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయించడంలో శ్రద్ధ చూపలేదన్నారు. కులమతాలకు అతీతకంగా అన్నివర్గాలకు సమ న్యాయం చేయడం కేవలం ముఖ్యమంత్రి కెసిఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సెట్విన్ డైరెక్టర్ ఎస్.ధన్‌రాజ్ మాదిగ, గన్‌ఫౌండ్రి డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, బద్రి, రాజు, ఉమా, నాగమణి, కల్యాణి, సంగీత తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ మందుల పంపిణి

విద్యార్థులకు నులి నివారణ మందులను వేసిన మేయర్, డిప్యూటీ మేయర్

సరూర్‌నగర్, ఆగస్టు 3 ప్రభాతవార్త: జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా గురువారం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని చల్లా లింగారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యారులకు నులి పురుగుల నివారణ మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన మేయర్ ముడావత్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డిలు విద్యారు థలకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గజ్జెల రాంచందర్, ఎంఇఓ కృష్ణయ్య, ప్రధానోపాధ్యాయురాలు సరళ, యుపిహెచ్‌సి డాక్టర్ వైశాలి తదితరులు పాల్గొన్నారు.

కెసిఆర్ నాయకత్వంలో గుణాత్మక అభివృద్ధి: ఎమ్మెల్యే

ఎల్.బి.నగర్, అగస్టు 3 ప్రభాతవార్త: తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపి, గుణాత్మక ప్రగతి కార్యాచరణను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నారని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాలు గురువారం ప్రారంభం అయిన సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఆయన ఛాంబర్‌లో కలిసి పుష్పగుచాన్ని అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

6న శ్రీ అష్టలక్ష్మీ సమేత శ్రీమహాలక్ష్మీ లక్ష కమల పుష్పార్చన

సైఫాబాద్, ఆగస్టు 3 ప్రభాతవార్త: హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ, ఆర్యవైశ్య సంఘం డబీర్‌పుర, హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం సహకారంతో ఈ నెల 6వ తేదీ ఉదయం కైరతాబాద్‌లోని శ్రీవాసవి కళ్యాణ మండపంలో 'శ్రీఅష్టలక్ష్మీ సమేత శ్రీమహాలక్ష్మీ లక్ష కమల పుష్పార్చన' నిర్వహిస్తున్నామని నిర్వహకులు తెలిపారు. ఈ మేరకు గురువారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహాసభ అధ్యక్షుడు సరాబు లక్ష్మణ్‌గుప్తా మాట్లాడుతూ 19 సంవత్సరాలకు ఒకసారి వచ్చే అధిక శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ఈ లక్ష కమల పుష్పార్చన నిర్వహిస్తున్నామని, దేశం చరిత్రలో, దేశంలోనే తొలిసారిగా ఈ కార్యక్రమం జరుగుతున్నదన్నారు. 121 మంది దంపతులచే సామూహికంగా శ్రీమహాలక్ష్మీ అమ్మవారికి లక్ష కమలం పూలతో అర్చన జరుగుతుందని, ఈ పూజ ఫలితం 1000 రేట్లు ఫలితాన్ని ఇస్తుందని, ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు కటకం శివకుమార్‌గుప్తా, లింగ ప్రకాష్‌గుప్తా, దయాకర్‌గుప్తా, తాడిశెట్టి పశుపతి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కేసీఆర్ కృషి: ఆజాం అలీ

అభినందనలు తెలియజేస్తున్న ఆజాం అలీ

మలక్‌పేట, ఆగస్టు 3 ప్రభాతవార్త : ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తున్నారని మలక్పేట నియోజకవర్గం టిఆర్ఎస్ ఇంచార్జి ఆజాం అలీ పేర్కొన్నారు. నందిగామ మండలం శ్రీనివాస గూడా గ్రామానికి తరలి వెళ్లిన నాయకులు రైతులను కలిసి రాష్ట్ర ప్రబుత్వం నేటి నుంచి రైతు రుణ మాఫీ పథకాన్ని అమలు చేస్తుందని వివరించారు. రాష్ట్ర ప్రబుత్వం రైతుల సంక్షేమం కోసం చేపడుతున్న ప్రజా పథకాల గురించి తెలియజేశారు. రైతులకు రుణమాఫీని అమలు చేయడంతో పాటు రైతుబంధు తదితర పథకాలను అమలు చేస్తూ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు.

విద్యుత్ ఉద్యోగులకు రక్షణ కల్పించాలి: ఖాద్రి

మలక్‌పేట, ఆగస్టు 3 ప్రభాతవార్త : విద్యుత్‌శాఖ ఏఈని దుర్భాషలాడుతూ దాడికి ఎక్కించిన వారిపై చర్యలు తీసుకోవాలని చాదర్ఘాట్ విద్యుత్ కార్యాలయం వద్ద విద్యుత్ శాఖ అధికారులు ఆందొళన చేపట్టారు విద్యుత్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరిగిందని చాదర్ఘాట్ ఏఈ ఖాద్రి తెలిపారు. దీంతో ఇంటి యజమాని చాదర్ఘాట్ విద్యుత్ శాఖ కార్యాలయానికి వచ్చి దూషించడంతో పాటు దురుసుగా ప్రవర్తించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నెహ్రానాయక్, పాండ్యానాయక్, వెంకటేశం, రామకృష్ణనంద్ పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE, MEDCHAL DIST, AT L.B.NAGAR
O.S.NO. 484 OF 2023

Between:-
1. Smt. Jinukula Mallamma W/o. late J. Lingaiah, aged about 48 years, Occupation House Hold, N/o. H.No. 2-8 Pullaigudem Vg, Atmakur Mandal, Yadadri Dist.
2. Jinukula Mounika D/o. late J. Lingaiah, aged about 25 years, Occupation House Hold, N/o. H.No. 2-8 Pullaigudem Vg, Atmakur Mandal, Yadadri Dist.
3. Jinukula Sai Kumar S/o. late J. Lingaiah, aged about 21 years, Occupation Student, All R/o. H.No. 2-81/1, Mallikarjuna Nagar, Peerzadiguda Municipal Corporation, Medipally Mandal, Medchal Dist.
... Plaintiffs

AND

1. The Tahsildar, Medipally Mandal, Medchal Dist.
2. All concerned
... Defendants

NOTICE

To
All Concerned
.. Defendant No.2

Please take notice that, the above named Plaintiffs have filed the suit for Declaration, to declare the Plaintiffs are the legal heirs of **late J@ Jinukala Lingaiah** and his below mentioned property i.e.

SCHEDULE OF PROPERTY

All that part and parcel of House No. 2-81/1, on Plot No.76/C in Sy.No.44 admeasuring 102 Sq.yards or 85 Sq.mts. having Ground Floor Plinth area of 295 Sft. situated at Mallikarjuna Nagar, Peerzadiguda Municipal Corporation, Medipally Mandal, Medchal Dist. (the then Peerzadiguda Village and Gramp

విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ

విద్యార్థులకు నులి పురుగు నివారణ మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది

దౌల్తాబాద్, ఆగస్టు 3 ప్రభాతవార్తః
నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా గురువారం మండల పరిధిలోని దేవరఫస్లాబాద్ పాఠశాలలో విద్యార్థులకు వైద్య సిబ్బంది ఆల్‌బెండజోల్ మాత్రలు వేశారు. మండల వ్యాప్తంగా మొత్తం 9864 మంది విద్యార్థులకు మాత్రలు వేయాల్సి ఉండగా 8870 మంది విద్యార్థులకు మాత్రలు వేసినట్లు తెలిపారు. మిగతా వారికి ఈ నెల 10న మాత్రలు వేయనున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు రామకృష్ణ, సిబ్బంది రఫీ, రఘు, హెచ్ఎం, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు చంద్రకళ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శరవేగంగా మిషన్ భగీరథ పనులు

మిషన్ భగీరథ పనులను పరిశీలిస్తున్న అధికారులు, సర్పంచ్ గూడూరు లక్ష్మీనరసింహారెడ్డి

కడ్తాల్,ఆగస్టు 3 ప్రభాతవార్త :
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ ద్వారా పట్టణాలకు, గ్రామాలకు, పల్లెలకు, తండాలకు,తాగునీటి సమస్యలు తీరాయని సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆంజనేయులు అన్నారు. గురువారం కడ్తాల్ మండల కేంద్రంలో సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ గూడూరు లక్ష్మీ నరసింహారెడ్డి, డివిజనల్ ఇంజనీర్లు మోహన్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డిలతో కలిసి గ్రామంలో మిషన్ భగీరథ పనులను పరిశీలించారు. శరవేగంగా దినదినాభివృద్ధి చెందుతున్న కడ్తాల్ మండల కేంద్రంలో త్రాగునీటి సమస్య తలెత్తకుండా మంచినీటి సరఫరా కొరకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఈ తెలిపారు. గ్రామంలో పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను వెంటనే పూర్తిచేయాలని, అదేవిధంగా సర్పంచ్ అభ్యర్థన మేరకు ప్రస్తుతం ఉన్న నీటి ట్యాంకులను (3,00,000 లీటర్లు) రోజుకు రెండు పర్యాయాలు మిషన్ భగీరథ నీటితో నింపి గ్రామంలో నీటి సరఫరా అందించాలని అధికారులను ఆదేశించారు. నూతనంగా ఏర్పడిన సాయిరాంనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన ఒకలక్ష లీటర్ల నీటి బ్యాంకును ఎస్ఈ స్థానిక సర్పంచ్, డీఈలతో కలిసి పరిశీలించారు. 35 లక్షల వ్యయంతో నిర్మించిన నీటి ట్యాంకును త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. అదేవిధంగా సర్పంచ్ గతంలో 2,3 వార్డులకు అనుసంధానం చేసే విధంగా మరొక లక్ష లీటర్ల నీటి ట్యాంక్ ఏర్పాటు నివేదికలు ప్రగతిలో ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మంచినీటి నివారణకు సత్వరమే స్పందించి సహాయ సహకారాలు అదిస్తున్న స్థానిక ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు నరెందర్‌రెడ్డి, డైరెక్టర్ లాయ్ అలీ, కాలనీవాసులు రాజేందర్‌గౌడ్, శ్రీశైలం, వాసుదేవరెడ్డి, మల్లేష్ పాల్గొన్నారు.

గుడి నిర్మాణానికి కాసాని వీరేశ్ విరాళం

దోమ.ఆగష్టు 3 ప్రభాతవార్త :
మండల పరిదిలోని గుండాల్ గ్రామంలో మైసమ్మ గుడి నిర్మాణం చేస్తున్నారు. ఈ విషయంపై గ్రామస్తులు తెలుగుదేశం పార్టీ పర్గి నియోజకవర్గం ఇంచార్జి కాసాని వీరేశ్‌ను గ్రామస్తులు ఆహ్వానించారు. దింతో గురువారం నాడు గ్రామములో పర్యటించి గుడి నిర్మాణం స్థలంను పరిశీలించారు. గుడి నిర్మాణం కోసం లక్ష రూపాయలు విరాళం అందజేశారు. గ్రామములో తెలుగుదేశం పార్టీ అబిమానంపై కొందరు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపార్టీ సాంస్కృతిక విభాగం అద్యక్షులు చంద్రహాస్, నాయకులు బెస్తనర్సిములు, రామన్నమాదిగ, డాక్టర్‌రాములు, కృష్ణ, మాజిఎంపిటిసి సత్యనారాయణ,
సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత : తహసీల్దార్ విజయ్‌కుమార్

కొడంగల్,ఆగష్టు 3ప్రభాతవార్త
ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత కల్పిస్తు పారదర్శకంగా సేవలు అందించేందుకు కృషి చేస్తానని తహశీల్దార్ బి.విజయ్‌కుమార్ తెలిపారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా సంగారెడ్డి జిల్లా నుంచి కొడంగల్ తహశీల్దార్‌గా బదిలీపై వచ్చిన ఆయన గురువారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈవీఎంలపై అవగాహన కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతు ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఓటరు నమోదు,మెబైల్ ఈవీఎం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఓటరు నమోదు ప్రక్రియతో పాటు ఈనెల 21న డ్రాఫ్ట్ నోటిఫికేషఫన్ జాబితాను ప్రకటించడం జరుగుతుందన్నారు. అలాగే అక్టోబర్ 1న ఫైనల్ పబ్లికేషన్ ప్రక్రియ ఉంటుందన్నారు. కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని 275 ఎన్నికల పోలింగ్ బూత్‌లను పరిశీలించడం జరుగుతుందన్నారు. కొడంగల్ మండలానికి సంభందించి ఉడిమేశ్వరం, ప్యాలమద్ది, పర్సాపూర్ తదితర గ్రామాల్లో గతంలో గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ఉన్న పోలింగ్ బూత్‌లను ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు మార్చడం జరిగిందన్నారు. వివిధ పనుల నిమిత్తం తహశీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజల విజ్ఞప్తులను పరిశీలించి

ఈవీఎంలపై అవగాహనను పరిశీలిస్తున్న నూతన తహశీల్దార్ విజయ్ కుమార్

ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళ్తానన్నారు. సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ సురేష్, ఎన్నికల డీటీ శివకుమార్‌లతో పాటు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కాగా నూతన తహశీల్దార్‌గా పదవి బాధ్యతలు చేపట్టిన బి.విజయ్‌కుమార్‌ను కార్యాలయ సిబ్బంది శాలువా పూలమాలలతో సన్మానించారు. ఇదిలావుండగా ఇదివరకు ఇక్కడ తహశీల్దార్‌గా కొనసాగిన బుచ్చయ్య హైద్రాబాద్‌కు బదిలీపై వెళ్ళారు.

కాంగ్రెస్ పార్టీ పోరాట ఫలితమే రైతు రుణమాఫీ

నాగసాన్‌పల్లి గ్రామంలో గ్రామ కమిటీ ఎన్నికల్లో మాట్లాడుతున్న వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సింహారెడ్డి

కోట్‌పల్లి, ఆగస్టు 3, ప్రభాతవార్త;
కాంగ్రెస్ దెబ్బకు దిగోచ్చిన బీఆర్ఎస్ పార్టీ అగమేఘాల మీద రుణమాఫీ పై ప్రకటన చేయడం కాంగ్రెస్ పార్టీ పోరాట ఫలితమే రైతు రుణమాఫీ అని వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పి. నర్సింహరెడ్డి అన్నారు. గురువారం నాడు కోట్‌పల్లి మండల పరిధిలోని నాగసాన్‌పల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో గ్రామ కమిటీ ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగనే వంటగ్యాస్ రూ. 500 కే, ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇంట్లో ఇద్దరు వృద్దులు ఉంటే కనీస పింఛన్ రూ. 5 వేలు

- జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి

ఇవ్వడం జరుగుతుందన్నారు. మొదటి ఏడాది 2, లక్షల ఉద్యోగాల భర్తీ అన్ని పంటలకు గిట్టుబాటు వంటివి ఇవ్వడం జరుగుతుందన్నారు. సొంత స్థలంలో ఇంటి నిర్మాణం కోసం రూ. 5 లక్షలు సాయం భూమి ఉన్న రైతులతో పాటు కౌలు రైతులకు ఎకరానికి రూ. 15 వేలు సాయం భూమి లేని ఉపాధిహమి రైతు కూలీలకు రూ. 12 వేలు సాయం ఇవ్వడం జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజలకు ఏమి చేసింది ఏమి లేదని తెలంగాణ రాష్ట్ర ప్రజలంత గమనిస్తురన్నారు. కేసీఆర్ ఓటమి భయం పట్టకుందని అందుకే భయంతో రైతులకు రుణమాఫీ ఆగమేఘాల మీద ప్రకటన చేయడం జరిగిందన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని మరిచిపోయరన్నారు. దళితులకు మూడు ఎకరాల భూమి ఏమైందన్నారు. దళితులకు, దళితబంధు, బీసీలకు బీసీ బంధు అని ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రావడం కాయమన్నారు. ఇందులో నాగసాన్‌పల్లి గ్రామ కమిటీ అధ్యక్షులుగా సామల జనార్ధన్‌రెడ్డి, ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో వికారాబాద్ జిల్లా మైనార్టీ అధ్యక్షులు అయూబ్ అన్సారీ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింగ్‌నాయక్, బీసీ సంఘం అధ్యక్షులు శ్రీనివాస్, మోత్కుపల్లి మాజీ సర్పంచు శ్రీనివాస్‌గౌడ్, రాంపూర్ మాజీ సర్పంచు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు రాంచెంద్రరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఏసు, బార్వాద్ ఎంపీటీసీ నర్సింహారెడ్డి ,మహిపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

-ఎస్‌బిఎం కేంద్ర బృందం వినీత్,శైనీ,అరున్

పెద్దేముల్, ఆగస్టు 3, ప్రభాతవార్త:
బహిరంగ మల విసర్జన రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరు కంకణ బద్దులై కృషిచేయాలని స్వచ్ఛ భారత్ మిషన్ (ఎస్‌బిఎం) కేంద్ర బృందం అసెటర్లు వినీత్,శైనీ, అరుణ్‌లు పిలుపునిచ్చారు. పెద్దేముల్ మండలంలోని మన్‌సాన్‌పల్లి, మారెపల్లి, మారెపల్లితాండా గ్రామాలలోని స్వచ్ఛ భారత్ ద్వారా నిర్మించిన మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలను, కంపోస్ట్‌షేడ్, పాఠశాలలోని మరుగుదొడ్లను గురువారం కేంద్ర బృందం అసెటర్లు పరిశీలించారు. స్వచ్ఛ భారత్ ద్వారా ఆయా గ్రామాల లోని నిర్మించినటువంటి మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలను సరియైన పద్దతిలో ప్రజలు ఉపయోగించుకుంటున్నారా లేదా అని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మ గాంధి కలలు గన్న పరిశుభ్ర భారతవనిని సాధించడమే స్వచ్ఛ భారత్ లక్ష్యమని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకొని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతి ఇంటికి మరుగుదొడ్డి తప్పనిసరి అవసరమని అన్నారు. భూగర్భ జలాలను పెంపొందించేందుకు ఇంకుడు గుంతలు ఎంతో దోహదం చేస్తాయని,అందుకు ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకో

ఇంకుడు గుంతలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం అసెటర్లు

వాలని అన్నారు. మన్‌సాన్‌పల్లి గ్రామంలో 161 ఇంకుడు గుంతలు, మరుగుదొడ్లను ఏర్పాటు చేయడం పట్ల వారు సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ యంఏ క్రిష్ణన్, డిపిఓ తరుణ్ కుమార్, డిఎల్‌పిఓ శంకర్‌నాయక్, యంపిడిఓ లక్ష్మప్ప,ఎస్‌బిఎం జిల్లా కోఆర్డినేటర్ రవి,అసిస్టెంట్ కోఆర్డినేటర్ లక్ష్మి,సర్పంచ్‌లు రుక్కిబాయి, బలవంతురెడ్డి పాండు నాయక్, ఉపసర్పంచ్ సంతోష్, టీఏలు అంజిలయ్య, ప్రవీన్‌కుమార్, సీసీలు సయీద్, వెంకటేశం, నర్సమ్మ, పీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

యాచారం మండలంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

యాచారం, ఆగస్టు 3 ప్రభాతవార్త : మండలంలోని యాచారం, మొగుళ్లవంపు గ్రామాల్లో గురువారం ఆవులు, గేదెలకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ శిబిరాలను ఎంపిపి కొప్పు సుకన్య భాష ఆధ్వర్యంలో పశు వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ప్రారంభించారు. రైతులు గ్రామాల్లో శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపిపి కొప్పు సుకన్య భాష మాట్లాడుతూ గ్రామంలో ఉన్నటువంటి పశు పెంపకందారులు ఎలాంటి రోగాలు లేకుండా రోగ నిర్ధారణకు టీకాలు తప్పనిసరి అన్నారు. టీకాలు వేయకపోతే రోగాల బారిన పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు రేఖ, కార్యదర్శి తిరుపతయ్య, జంగయ్య, రైతులు బుగ్గయ్య, నారిమళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేస్తున్న ఎంపిపి, పశు వైద్యాధికారుల

కోట్‌పల్లి మండల ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కోట్‌పల్లి మండల ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు,

మంబాపూర్‌లో సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

.సీఎం కేసిఆర్ చిత్రపటంకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు.

కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

కొడంగల్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రైతు బాంధవుడు కెసిఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

చౌడపూర్ మండలంలో...
చౌడపూర్ ఆగస్టు3,ప్రభాతవార్త : మండల పరిధిలోని మక్త వెంకటాపూర్‌లో రైతు రుణమాఫీ ప్రక్రియ ప్రారంభించాలని ప్రకటించిన సందర్భంగా జడ్పిటిసి రాందాస్ ఆధ్వర్యంలో కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. రాందాస్ మాట్లాడుతూ...ముఖ్యమంత్రి కెసిఆర్ రైతు సంక్షేమం కోరుకునే వ్యక్తి రైతు బాంధవుడు కాబట్టి రైతు రుణమాఫీ చేయడం రైతులకు అండగా నిలవడం హర్షనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి చిలుకల సత్యమ్మ, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్, యువ నాయకులు చిలుకల శంకర్, రైతు అధ్యక్షుడు జంగయ్య, జరుపుల వెంకట్, నుర్య నాయక్, లింగ్య నాయక్, శంకర్, పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

కోట్‌పల్లి మండలంలో...
కోట్‌పల్లి, ఆగస్టు 3, ప్రభాతవార్త; తెలంగాణ ప్రజలకు తెలంగాణ రైతాంగానికి ఏ సందర్భంలో ఏం కావాలో ముఖ్యమంత్రి కేసీఆర్ తెలుసని తెలంగాణ ప్రజల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్నారని కోట్‌పల్లి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సుందరి అనిల్ అన్నారు. గురువారం నాడు కోట్‌పల్లి మండల కేంద్రంలో రైతులకు రుణమాఫీ చేసిన సందర్భంగా అయన చిత్ర పట్టానికి పాలభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు వెంకటేష్‌యాదవ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాములు, కోట్‌పల్లి సర్పంచు నక్కల విజయలక్ష్మి, మండల పార్టీ సీనియర్ నాయకులు లక్కాకుల మల్లేశం, పతంగేపాండు, మండల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఉప్పరి మహేందర్, మండల వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ దశరథ్‌గౌడ్, జిన్నారం ఎంపీటీసీ బందయ్య, మండల ప్రధాన కార్యదర్శి, కుమ్మరి లాలప్ప, ఇందోల్ సర్పంచ్ రామచందర్, మత్స్య సహకార సంఘం అధ్యక్షులు రావిరాల ఆనంద్, గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, సుశీల్, దినేష్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దేముల్ మండలంలో...
పెద్దేముల్, ఆగస్టు 3, ప్రభాతవార్త: దేశానికి వెన్నెముక అన్నం పెట్టె రైతన్నకు రాష్ట్ర సిఎం కేసిఆర్ అడుగడుగున అండగ నిలుస్తు రైతులను రాజులుగా చేయడమే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు పరుస్తున్నారని సర్పంచ్ ఆర్.శ్రావన్ అన్నారు. రైతుల రుణమాఫీ సెప్టెంబర్ రెండవ వారంలోపు పూర్తి చేయాలంటు సిఎం కేసిఆర్ ఆదేశాలు జారీ చేయడం పట్ల హర్షం వ్యక్తంచేస్తు గురువారం పెద్దేముల్ మండలంలోని మంబాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సిఎం కేసిఆర్ చిత్ర పటానికి బిఆర్ఎస్ నాయకులు, రైతులతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సంగెం వెంకటయ్య, మారుతి, సంగెం చంద్రప్ప, తాడి అంజిలయ్య, యాసని ఎల్లప్ప యేసు, కుమ్మరి అంజి, బోయిని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్ మండలంలో...
బొంరాస్‌పేట్,ఆగస్టు3,ప్రభాతవార్త ః తెలంగాణ ముఖ్యమంత్రి కేసిఆర్ ఎన్నికల సందర్భంగా రైతులకు రైతు రుణామాఫీని అమలు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేసిన సందర్భంగా అయన చిత్రపటంకు బిఆర్ఎస్ పార్టీ నాయకులు, రైతులు పాలాభిషేకం చేశారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు యాదగిరి, విష్ణువర్ధన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నారాయణరెడ్డి, నర్సింలునాయక్, శ్రావణ్‌గౌడ్, రవిగౌడ్, దేశ్యానాయక్, రైతులు పాల్గొన్నారు.

కుల్కచర్ల మండలంలో...
కుల్కచర్ల ఆగష్టు 3,ప్రభాతవార్త; రైతులకు లక్ష రూపాయల రుణమాఫి చేసి సిఎం కేసిఆర్ ఆదుకున్నారని మాజి బిఆర్ఎస్ మండల అద్యక్షుడు సారా శ్రీనివాస్, గ్రామ అద్యక్షుడు మాసని పెంటయ్య అన్నారు. గరువారం కుల్కచర్ల మండల పరిదిలోని మజాహిద్‌పూర్ గ్రామంలో సిఎం కేసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాజి ఎంపిటిసి శ్యాంరావు, మత్స్య సమకార సంఘం అద్యక్షుడు పోమాల అనంతయ్య, ఆలయ చైర్మన్ సందని రామకృష్ణ, వార్డు మెంబర్లు చిట్యాల వెంకటయ్య, సీనియర్ నాయకుడు డాక్టర్ కృష్ణ, ఆర్. వెంకటేష్, కిన్నెర రాములు, ఎదిరె నర్సిములు, దప్పు శ్రీనివాస్, గుండా రాజు, కృష్ణ, శ్రీనివాస్, అరవింద్, రవి, రైతులు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ పట్టణంలో..
కొడంగల్, ఆగష్టు 3ప్రభాతవార్త : రైతు రుణమాఫీకి సంబందించి ప్రభుత్వం ప్రకటించడం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. రైతు రుణమాఫీ చేస్తున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించడాన్ని హర్షిస్తు గురువారం కొడంగల్ అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు రైతులతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల పార్టీ అద్యక్షులు దామోదర్‌రెడ్డి మాట్లాడుతు సర్పంచ్‌లు సయ్యద్ అంజద్, శంకర్‌నాయక్, మాజీ సర్పంచ్ రమేష్‌బాబు మాట్లాడుతు.. గతంలో ఏ సీఎం కూడ రైతుల గురించి పట్టించుకున్న పాపాన పోలేదని, అలాంటిది ప్రస్తుత సీఎం కేసీఆర్ రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్ర మంలో బీఆర్ఎస్ నాయకులు మురళిధర్‌రెడ్డి, నాగారం మాజీ సర్పంచ్ నారాయణ, బాకారం అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

దోమలో పాలాబిషేకం చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

దోమలో మండలంలో..
దోమ.ఆగష్టు 3 ప్రభాతవార్త : తెలంగాణాలో ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు చేస్తున్న సేవలను అందరు గుర్తించుకొని మళ్ళి అదికారంలోకి వచ్చె విదంగా ప్రజలందరు సహకరించాలని దోమ మండల సర్పంచుల సంఘం అద్యక్షులు రాజిరెడ్డి, మండల రైతు సమన్వయ అద్యక్షులు లక్ష్మయ్య అన్నారు. గురువారం నాడు దోమ మండల కేంద్రములోని బస్టాండ్ చౌరస్తాలో ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావుకు పాలాబిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌యంపిపి మల్లేశం, మాజియంపిపి రాజగోపాలాచారి, మండలపార్టీ అద్యక్షులు గోపాల్‌గౌడ్, పాల సంఘం అద్యక్షులు బీమయ్య, మాజి అద్యక్షులు శ్రీనివాస్, బిచ్చయ్య, శ్రీనివాస్‌రెడ్డి, మైను, మన్యానాయక్, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు పరిశీలించిన జడ్పివైస్ చైర్మన్

-నాణ్యతతో నిర్మించాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారికి సూచన

నందిగామలో రహదారి విస్తరణ పనులపై అధికారితో సమీక్షిస్తున్న జడ్పివైస్ చైర్మన్ ఈట గణేష్,సర్పంచ్ తదితరులు

నందిగామ ఆగస్టు3,ప్రభాతవార్త : నందిగామలో మహాత్మగాంధీ విగ్రహం నుండి బైపాస్ రహదారి వరకు నిర్మిస్తున్న బిటి డబుల్ రోడ్డును నాణ్యతతో నిర్మించేలా చర్యలు తీసుకోవాలని జడ్పివైస్ చైర్మన్ ఈట గణేష్ ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి హేమంత్‌కు సూచించారు. గురువారం గ్రామంలో ప్రధాన రహదారి విస్తరణ పనులను సర్పంచ్ జిల్లెల వెంకట్ రెడ్డితో కలిసి పరిశీలించారు. హైటెక్ హాంగులతో ,ఆతాధునిక సౌకర్యాలతో నిర్మించతలపెట్టిన ఈ యజ్ఞానికి గ్రామస్థులు తోడ్పాలునందించాలని కోరారు. నందిగామ అభివృద్ధికి రాజీలేని పోరాటం చేయడానికి వెనకడుగు వేయబోమన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు దార సురేష్, తుప్పుడు నర్సింలు, కృష్ణ, జీ.రవి, ప్రశాంత్ రెడ్డి, సీనియర్ కాంట్రాక్టర్ భిక్షపతి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడులను అరికట్టాలి

డీటీ నారాయణకు వినతిపత్రం అందజేస్తున్న క్రైస్తవులు

ఆమనగల్లు, ఆగస్టు03, ప్రభాతవార్త: మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ఆవర్గానికి చెందిన ప్రజలు ఆమనగల్లు పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. నల్లబ్యాడ్జీలు ధరించి పట్టణంలోని పురవీధుల గుండా మౌనంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగించి రెవెన్యూ అధికారి డీ.టీ నారాయణ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. నిరసన ర్యాలీకి వివిధ ప్రాంతాలకు చెందిన క్రైస్తవులు పెద్దఎత్తున హాజరైనారు. జాతీయ రహదారితోపాటు పట్టణంలోని ప్రముఖ అంతర్గత రోడ్లపై నిరసన ర్యాలీ చేపట్టారు. మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవ వర్గంపై దాడులు జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని వారు అన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి దాడులను అపాలని, అఘాయిత్యాలకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ అసోషియేషన్ నాయకులు అధ్యక్షుడు సత్యానంద్, శ్రీశైలం, సపియాబేగం, కిషోర్‌కుమార్, ఇర్మాయాజాన్, రాజ్, సిడి, సిరి ప్రసాద్, జాన్సన్, ప్రేమ్‌రాజ్, అమ్మన్, ప్రకాష్, సైదులు ఉన్నారు.

భక్తులతో కిటకిటలాడిన ధర్మగిరి

శంషాబాద్ ఆగస్టు3,ప్రభాతవార్త :
శంషాబాద్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రం ధర్మగిరి సాయిబాబా ఆలయం గురువారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుండి బాబా దర్శనం కోసం పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షురాలు ధరణి మాత ఆలయ ధర్మకర్త శివసాయి దత్తు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శంషాబాద్ మామిడిపల్లి సీఆర్పీఎఫ్ క్వార్టర్స్ జలపల్లి ,కాటేదాన్ దూర్గనగర్ ,సాతంరాయి తదితర ప్రాంతాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి అన్నదాన కార్యక్రమంలో భోజన ప్రసాదాన్ని స్వీకరించారు. బాబా ఆలయాన్ని సందర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి బాబా దర్శనం చేసుకున్నారు. ఇక్కడికి వచ్చే భక్తులకు పంచభక్ష పరమాన్నాలతో భోజన వసతి కల్పించడం పట్ల భక్తులు సంతోషం వ్యక్తం చేశారు.

రెవెన్యూ రికార్డులో పేరు నమోదు చేయాలి

తమకు న్యాయం చేయాలని కోరుతూ శంకర్‌పల్లి డిప్యూటీ తహశీల్దార్ ప్రియాంకకు వినతిపత్రం అందించిన కొండకల్, బల్కాపూర్, మోకిల తండా రైతులు

శంకర్‌పల్లి, ఆగస్టు 3 ప్రభాతవార్త:
గత ఏడు దశాబ్దాలుగా పొలం సాగు చేసుకుంటూ జీవిస్తున్న రైతులకు న్యాయం చేయాలని కొండకల్, బల్కాపూర్, మోకిల తండా రైతులు గురువారం శంకర్‌పల్లి డిప్యూటీ తహశీల్దార్ ప్రియాంకకు వినతిపత్రం అందజేశారు. కొండకల్ రెవెన్యూ పరిధిలోని 555 సర్వే నెంబర్‌లో సుమారు 91 మంది రైతులు 70 సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటున్నారు. వారికి వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్నారని అన్నారు. గత గత పది సం